FOR ADS.......
CONTACT : 8333818121

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :184 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 24 - ఫిబ్రవరి - 2026

## తిరుమల లడ్డూ వివాదం.. ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట



ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేసిన సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ కొట్టివేత

కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

సిట్, కమిటీ దర్యాప్తులు వేర్వేరని, ఒకదానిపై ఒకటి ప్రభావం చూపవని వెల్లడి

అమరావతి : రిటైర్డ్ ఐఏఎస్ దినేశ్‌కుమార్ కమిటీ నివేదికకు మార్గం సుగమం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలకు సంబంధించిన వివాదంలో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇవాళ కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. మిగతా..2లో

## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు మోగనున్న ఎన్నికల నగారా

ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం

పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

ఢిల్లీ : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. మిగతా..2లో

## తెలంగాణ క్యాబినెట్ భేటీ..
## జనగణనపై కీలక చర్చ



2

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) క్యాబినెట్ సమావేశం అయింది.
- ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చిస్తున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) క్యాబినెట్ సమావేశం అయింది.

మిగతా..2లో

## అనాథలకు ఉపాధి కల్పన..
## తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందాలు

- అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.
- ఇందులో భాగంగా తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి..



వివరాలు 2లో..

హైదరాబాద్, ఫిబ్రవరి 23 : అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. ఈ శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు.

## తన పేరుతో సంస్థల ఏర్పాటుపై
## స్పందించిన కేటీఆర్

- ★కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
- ★తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ
- ★ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన



## తేజస్ ఫైటర్ జెట్లను
## భారత్ పక్కన పెట్టిందా



2

- ఇటీవల రన్‌వే దాటిన తేజస్ జెట్, పైలట్ సురక్షితం
- ముందు జాగ్రత్తగా 30 సింగిల్ సీట్ విమానాలు తాత్కాలికంగా నిలిపివేత- ఇప్పటివరకు మూడు ప్రమాదాలు
- డెలివరీల ఆలస్యం మధ్య హెచ్ఏఎల్‌పై ఒత్తిడి

## భారత్ ట్యాక్సీ'తో కనీస ఆదాయం'
## క్యాబ్ డ్రైవర్లకు గుడ్ న్యూస్ చెప్పిన అమిత్ షా

- ❖ప్రతి కిలోమీటర్‌కు కనీస బేస్ రేట్ నిర్ణయం
- ❖లాభాల్లో 80% డ్రైవర్లకే కమిషన్ లేకుండా సేవలు
- ❖ మహిళల కోసం సారథి దీదీ ప్రత్యేక ఫీచర్
- ❖మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా విస్తరణ లక్ష్యం

ఢిల్లీ : యాప్ ఆధారిత క్యాబ్ సేవల్లో డ్రైవర్లు తక్కువ ఆదాయం, ఎక్కువ కమిషన్ భారంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సహకార క్యాబ్ సర్వీస్ భారత్ ట్యాక్సీ వారికి భరోసా కల్పించనుంది. డ్రైవర్లకు




2 లో

కనీస ఆదాయం ఉండేలా ప్రతి కిలోమీటర్‌కు బేస్ రేట్ ఖరారు చేస్తామని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

### దానికి మించిన లాభం మళ్లీ మీకే రావాలి: షా

దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్ ప్రాంతాలకు చెందిన క్యాబ్, ఆటో డ్రైవర్లతో జరిగిన టౌన్ హాల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రైవేట్ యాప్ కంపెనీలు తమ లాభాల కోసం డ్రైవర్ల కనీస రేటును నిర్ణయించకుండా ఉంచాయని విమర్శించారు. "మీరు ఎంత పని చేసినా కనీసంగా సంపాదించే రేటు ఉండాలి. దాని మించిన లాభం మళ్లీ మీకే రావాలి" అని చెప్పారు. మిగతా..2లో

## బంగాల్‌లో అధికార మార్పు
## తీసుకురావాలి

### ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ లేఖ

- త్వరలో బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు
- ఈ నేపథ్యంలో బంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ లేఖ
- బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని పిలుపు

ఢిల్లీ : మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు.



2 లో

బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని (ప్రభుత్వాన్ని మార్చాలని) ప్రజలను కోరారు. బంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంగాల్ ప్రజలకు నరేంద్ర మోదీ సోమవారం లేఖ రాశారు. ఈ లెటర్లను బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు. "మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## ఏపీ అసెంబ్లీలో జైళ్ల సంస్కరణల బిల్లుకు ఆమోదం



2

- ఖైదీలకు క్షమాభిక్షపై హోంమంత్రి కీలక ప్రకటన!
- జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లు'ను ఏకగ్రీవంగా ఆమోదించిన ఏపీ అసెంబ్లీ
- జైళ్లను సంస్కరణాలయాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న అనిత
- ఖైదీలకు క్షమాభిక్ష కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని వ్యాఖ్య

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జైళ్లలో మగ్గుతున్న ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా

## హైదరాబాద్ మెట్రో రైలుపై
## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం

ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం

రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

## ఆ మ్యాచ్ కూడా స్టేడియంకు వెళ్లి చూస్తా
## జగన్‌కు నారా లోకేశ్ కౌంటర్

- భారత్ టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు వెళితే ఆ మ్యాచ్ తప్పక చూస్తానన్న లోకేశ్
- అవసరమైతే జగన్‌కు కూడా టికెట్ కొనిస్తానని సెటైర్
- వైసీపీ హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు రూ.1000 కోట్ల లబ్ధి అని ఆరోపణ
- హెరిటేజ్‌కు ప్రభుత్వ లబ్ధి చేకూరలేదని స్పష్టీకరణ
- బడ్జెట్‌పై చర్చ కోరేవాళ్లు సభను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్న



అమరావతి : టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరితే, ఆ మ్యాచ్ చూసేందుకు తాను తప్పనిసరిగా వెళ్తానని

తొలి ఆకాంక్ష

మంగళవారం- 24 - ఫిబ్రవరి - 2026

మొదటి పేజీ తరువాయి

## ఆ మ్యాచ్ కూడా స్టేడియంకు వెళ్లి చూస్తా: జగన్‌కు నారా లోకేశ్ కౌంటర్

మంత్రి నారా లోకేశ్ అన్నారు. అవసరమైతే పులివెందుల ఎమ్మెల్యే (జగన్)కి కూడా తన డబ్బులతో టికెట్ కొనిస్తానని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్ వీక్షించడంపై జగన్ చేసిన విమర్శలకు లోకేశ్ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "క్రికెట్ మ్యాచ్ చూడటానికి స్టేడియంకు వెళ్లాలా అని జగన్ అంటున్నారు. టీమిండియా ఫైనల్‌కు వెళితే కచ్చితంగా వెళ్తాను. ఆయనకూ (జగన్‌కు) ఓ టికెట్ తీసుకుంటా" అని లోకేశ్ అన్నారు. తాను గతంలో సొంత డబ్బులతోనే మ్యాచ్ చూశానని మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, జగన్‌పై లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌కు చెందిన సాక్షి మీడియా, భారతి సిమెంట్స్ సంస్థలకు రూ.1000 కోట్ల మేర అడ్డగోలుగా లబ్ధి చేకూర్చారని లోకేశ్ ఆరోపించారు. అయితే, తమ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రయోజనం కలగలేదని తేల్చిచెప్పారు. హెరిటేజ్ నెయ్యిపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ.. కిలో నెయ్యి మార్కెట్‌లో రూ.1,000కి పైగా ఉంటే, రూ.360కి ఎక్కడైనా దొరికితే అది కల్తీదేనని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. బడ్జెట్‌పై చర్చ జరగాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. నిజంగా చర్చపై చిత్తశుద్ధి ఉంటే, నాలుగు రోజుల పాటు సభా కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు.

## తిరుమల లడ్డూ వివాదం.. ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట

తిరుమల నెయ్యి వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్ దర్యాప్తు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఎలా ఏర్పాటు చేస్తుందని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు. స్వామి వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. "రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటు చేయబడింది. ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేస్తుందని మేము భావించడం లేదు. చట్ట ప్రకారం సిట్, ఏకసభ్య కమిటీ తమ తమ విధులను నిర్వర్తించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఈ రెండు విచారణలు వేర్వేరని, ఒకదాని పరిధిలోకి మరొకటి రాదని (ఓవర్‌లాపింగ్ కాదని) తేల్చి చెప్పింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపులో లోపాలు జరిగాయని సీబీఐ సిట్ తన నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించింది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా ఎవరిపై, ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దినేశ్‌కుమార్ కమిటీ తన విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

## అనాథలకు ఉపాధి కల్పన.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందాలు

పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రేమ్జీ యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రేమ్జీ యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదనిడ భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వంపరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

హైదరాబాద్: తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

## తెలంగాణ క్యాబినెట్ భేటీ.. జనగణనపై కీలక చర్చ

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చిస్తున్నారు. అయితే, స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. జనగణన-2027 కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. మే 11వ తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో జనగణన ప్రక్రియకు 89 వేల మంది సిబ్బందిని నియమించింది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. జనగణన 2027పై కేబినెట్ నిర్ణయాలని సీఎస్ రామకృష్ణారావు వెల్లడించారు. కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నలతో జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. హౌస్ లిస్టింగ్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను సీఎస్ వివరించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన ప్రక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.

## లంచం, అవినీతే సీఎం అసలైన స్నేహితులు'- స్టాలిన్ పై విజయ్ ఫైర్

**అధికార డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర విమర్శలు**

**స్టాలిన్ తప్పుడు హామీలతో మోసం చేస్తున్నారని ఆరోపణ**

**టీవీకే, డీఎంకే మధ్యే అసలు రాజకీయ పోరాటమని స్పష్టం**

**విజిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు పిలుపు**

ఢిల్లీ : తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, నటుడిగా స్టార్‌డమ్ సాధించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డీఎంకేను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

మార్పు ఎక్కడుంది?

వెల్లూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. "రాష్ట్రాన్ని సూపర్‌స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?" అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తుచేశారు.

చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయంటూ!

ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్‌అప్ కామెడీ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు. "ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం" అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే మధ్యేనని స్పష్టం చేశారు.

# రాజమహేంద్రవరం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు సాయం

మొదటి పేజీ తరువాయి

పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని అధికారులు తెలిపారు. మిగిలిన అందరి నుంచి శాంపిల్స్ తీసుకుంటున్నామన్నారు. పాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రాజమహేంద్రవరం వెళ్లాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కొనసాగుతోంది: రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో కొంతమంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటిటా సర్వే చేపట్టినట్లు క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. కల్తీ పాలన ఆరోపణల నేపథ్యంలో పాలు పోసే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోందని, పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించినట్లు కీర్తి చేకూరి చెప్పారు. పాల వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించిందని అన్నారు. స్థానికుల్లో ఏ లక్షణాలున్నా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ భరోసానిచ్చారు. ఏ లక్షణాలున్నా 94940 60060 ద్వారా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు.

### రాజమహేంద్రవరంలో అస్వస్థత, మరణాలపై సీఎం సమీక్ష

"ఇప్పటివరకు 73 శాంపిల్స్ సేకరించాం. ఇవాళ సాయంత్రానికి ఫలితాలు వస్తాయి. ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఎలాంటి లక్షణాలున్నా చికిత్స ఆందిస్తున్నాం. 42 మంది రైతుల నుంచి పాల సేకరణ జరుగుతోంది. పశువులు, వాటి ఆహారం శాంపిల్స్ సేకరించాం. పాలు, పెరుగు శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ విభాగం సేకరించింది. ఇప్పటివరకు నలుగురు మరణించారు. తాడి కృష్ణవేణి, తాడి రమణి, రాధాకృష్ణమూర్తి, శేషగిరిరావు మరణించారు. 8 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంటింటికి వెళ్లి రక్త నమూనాల సేకరణ కొనసాగుతోంది." – కీర్తి చేకూరి, జిల్లా కలెక్టర్ నాలుగుకు చేరిన అనూరియా మృతులు: ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ ఇద్దరు మృతి చెందారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రుల్లో పలువురికి చికిత్స చేస్తున్నారు. కలుషిత పాలు తాగి అస్వస్థతకు గురై బాధితులు ఆస్పత్రిలో చేరారు. రాజమహేంద్రవరం ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఘటన జరిగిన ప్రాంతాల్లో పాలు, నీరు, ఇతర నమూనాల సేకరణించారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు అధికారులు ఏర్పాటు చేశారు. ఘటనపై ఆరోగ్యశాఖ, నగరపాలక అధికారులు ఇంటింటా సర్వే చేపట్టారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది: ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి సమీక్షలు చేస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. పాలు సరఫరా చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అనధికారికంగా నడుపుతున్న డెయిరీని సీజ్ చేశామని పేర్కొన్నారు. విజయవాడ నుంచి కూడా నిపుణులు వచ్చారని తెలిపారు. శాంపిళ్ల సేకరణ జరుగుతోంది. వాటి ఫలితాలు వచ్చాక మరిన్ని వివరాలు వస్తాయన్నారు.

# బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి : ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ లేఖ

మొదటి పేజీ తరువాయి

ఆ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రానున్న తరం భవిష్యత్తు మీరు బాగా ఆలోచించి తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నేడు 'సోనార్ బంగ్లా' గురించి కలలు కనే ప్రతి యువకుడు, వృద్ధుడు, మహిళలు చాలా బాధలో ఉన్నారు. వారి బాధ నా హృదయాన్ని తాకింది. అందువల్ల నేను నా గుండె లోతుల్లో నుంచి ఒక తీర్మానం చేస్తున్నాను. బంగాల్‌ను వికసిత్ (అభివృద్ధి చెందిన), సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలనేది నా సంకల్పం" అని మోదీ లేఖలో పేర్కొన్నారు.

### టీఎంసీపై విమర్శలు

గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీర్వాద బలంతో తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం నుంచి యువత కలలను నెరవేర్చడం వరకు, మహిళలను సాధికారపరచడం నుంచి సమాజంలోని ప్రతి వర్గాన్ని చేరుకోవడం వరకు తమ ప్రభుత్వ విధానాలు, నిరంతర ప్రయత్నాల సానుకూల ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌పై మోదీ మండిపడ్డారు. "బంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజల చేత 'జన్ ధన్ యోజన' ఖాతాలు ఓపెన్ చేయించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద రాష్ట్రంలో 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. మేము మాత్రం చిరు వ్యాపారులు, వ్యవస్థాపకులకు రూ.2.82 లక్షల కోట్ల విలువైన రుణాలు అందించాం. 'అటల్ పెన్షన్



యోజన' కింద 56 లక్షల మంది సీనియర్ సిటిజెన్స్‌కు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. తద్వారా మాతృమూర్తులు, సోదరీమణులను పొగ నుంచి విముక్తి కల్పించాం."

**- నరేంద్ర మోదీ, భారత ప్రధాని**

### అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపాం!

బంగాల్ రైతులు దేశం మొత్తానికి ఆహారం సరఫరా చేస్తున్నారని, కానీ తమ కుటుంబాలను పోషించడానికి వారు కష్టపడుతున్నారని మోదీ అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం చేస్తున్నామని అన్నారు. తద్వారా అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు నింపడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "బంగాల్ దేశ ఆర్థిక వ్యవస్థ దిశను నిర్ణయించేది. పారిశ్రామిక అభివృద్ధిలో అగ్రగామిగా ఉండేది. కానీ నేడు ఈ అద్భుతమైన రాష్ట్రం దీనావస్థను చూసి నా మనసు బాధపడుతోంది. 6 దశాబ్దాల బుజ్జగింపు రాజకీయాల కారణంగా బంగాల్‌కు జరిగిన కోలుకోలేని నష్టాన్ని మాటల్లో వ్యక్తపరచలేం. ఓ వైపు యువత ఉపాధి లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. మరోవైపు రాష్ట్రంలోని మహిళలు తమకు భద్రత లేదని భావిస్తున్నారు. స్వామి వివేకానంద, రిషి అరబిందో కలలు కన్న బంగాల్ నేడు ఓటు బ్యాంకు రాజకీయాలు, హింస, అరాచకత్వంతో నిండిపోయింది" అని మోదీ పేర్కొన్నారు. అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసతో బంగాల్ మునిగిపోయిందని మోదీ ఆరోపించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో నేడు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, పేదల ముఖాల్లో చిరునవ్వులు వికసించాయని అన్నారు. బంగాల్‌లో కూడా ఈ అభివృద్ధి, పురోగతిని తాను తీసుకొస్తానని తెలిపారు. భరతమాత ముద్దుబిడ్డలు కలలు గన్న బంగాల్‌ను పునర్నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 2026 నాటికి రాష్ట్రాన్ని వికసిత్ బంగాల్‌గా మారుస్తామని ప్రమాణం చేద్దామని అన్నారు. "మీకు సేవ చేసే అవకాశం నాకు లభిస్తే ప్రతి క్షణాన్ని మీ ముఖంలో చిరునవ్వు తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. అవినీతి నుంచి ప్రజలను విముక్తి చేస్తాను. మహిళల భద్రత కోసం పాటుపడతాను. మన పిల్లలు (బంగాల్ యువత) ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మత హింసకు గురైన మన శరణార్థ సోదర సోదరీమణులు సీఏఏ ద్వారా పౌరసత్వం పొందుతారు" అని మోదీ స్పష్టం చేశారు.

# తేజస్ ఫైటర్ జెట్లను భారత్ పక్కన పెట్టిందా

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ : స్వదేశీ యుద్ధవిమానం తేజస్ మళ్లీ ప్రమాద వార్తల్లో నిలిచింది. ఫిబ్రవరి 7వ తేదీన సరిహద్దు ప్రాంతానికి సమీపంలోని వాయుసేన ఎయిర్‌బేస్‌లో ల్యాండింగ్ సమయంలో తేజస్ ఫైటర్ జెట్ రన్‌వేను దాటి వెళ్లడంతో విమానం నిర్మాణ భాగాలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఆ ఘటనలో పైలట్ ముందస్తు జాగ్రత్త పడడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

### తేజస్ ఫైటర్ జెట్లను భారత్ పక్కన పెట్టిందా?

బ్రేక్ వ్యవస్థలో లోపం కారణంగానే ఆ ప్రమాదం జరిగి ఉండొచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఆ ఘటనపై అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, భారత వాయుసేన ముందు జాగ్రత్త చర్యగా తమ వద్ద ఉన్న దాదాపు 30 సింగిల్‌సీట్ తేజస్ విమానాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి విమానాన్ని సాంకేతికంగా పూర్తిగా తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### తేజస్ అంటే ఏమిటి

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన ఎల్‌సీఏ తేజస్ ఒక సింగిల్ ఇంజిన్, మల్టీ రోల్ ఫైటర్ జెట్. దీన్ని ఏరానాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ అభివృద్ధి చేసింది. గగనతల రక్షణ, సముద్ర పర్యవేక్షణ, కచ్చితమైన దాడులు వంటి అనేక మిషన్లకు అనువుగా ఆ విమానాన్ని రూపొందించారు. 2003లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయూ దీనికి తేజస్ అనే పేరు పెట్టారు. సంస్కృతంలో



తేజస్ అంటే కాంతి, శక్తి అనే అర్థం.

### ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయంటే

తేజస్ విమానాలు 2016 నుంచి వాయుసేనలో సేవలు అందిస్తున్నాయి. ఇప్పటివరకు మూడు ప్రధాన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మొదటి ఘటన 2024 మార్చిలో రాజస్థాన్ లోని జైసల్మేర్ సమీపంలో జరిగింది. ఆపరేషనల్ ట్రైనింగ్ సమయంలో తేజస్ విమానం కూలిపోయింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ ఘటనపై విచారణ కమిటీని నియమించారు.

### రెండో ప్రమాదం ఎక్కడ జరిగిందంటే

రెండో ప్రమాదం 2025 నవంబర్‌లో దుబాయ్ ఎయిర్ షోలో జరిగింది. ఎయిర్ డెమోన్స్ట్రేషన్ సమయంలో విన్యాసాలు చేస్తుండగా విమానం అదుపు తప్పి నేలమీద పడిపోయింది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. దీనిపై కూడా విచారణ చేపట్టారు. ఇప్పుడు తాజా ఘటన మూడోది. అయితే ఇది క్రాష్ కాకపోయినా, రన్‌వే దాటడం వల్ల విమానం దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది.

### తేజస్ విమానాల డెలివరీలపై ప్రభావం?

ఇప్పటికే తేజస్ తయారీ, సరఫరా విషయంలో ఆలస్యం జరుగుతోంది. 2021లో రక్షణ మంత్రిత్వ శాఖ 83 తేజస్ వీఎ-1ఎ జెట్ల కొనుగోలుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది. తర్వాత మరిన్ని 97 విమానాలకు మరో ఒప్పందం జరిగింది. కానీ ఇంజిన్ల సరఫరాలో జాప్యం కారణంగా ఉత్పత్తి షెడ్యూల్ వెనుకబడింది. ముఖ్యంగా జీఈ ఎయిర్ స్పేస్ ఇంజిన్ల డెలివరీల్లో ఆలస్యం కావడం ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ప్రమాదం తేజస్ పై మరింత ఒత్తిడి తీసుకువచ్చే అవకాశముంది.

### సాంకేతిక తనిఖీలు పూర్తయిన తర్వాత మళ్లీ

అయినప్పటికీ, వాయుసేన వర్గాలు తేజస్‌పై పూర్తి విశ్వాసమే ఉందని, భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేస్తామని చెబుతున్నాయి. తేజస్ జెట్లను పూర్తిగా పక్కన పెట్టినట్లు ప్రచారం జరుగుతున్నా, అది తాత్కాలిక జాగ్రత్త చర్య మాత్రమేనని స్పష్టం చేస్తున్నాయి. సాంకేతిక తనిఖీలు పూర్తయిన తర్వాత మళ్లీ సేవల్లోకి తీసుకొస్తారు. స్వదేశీ యుద్ధవిమానంగా దేశ గర్వంగా నిలిచిన తేజస్ ప్రాజెక్ట్‌కు ఘటనలు సవాళ్లుగా మారినా, లోపాలను సరిదిద్దుతూ మరింత మెరుగైన భద్రతతో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా వాయుసేన కృషి చేస్తోంది.

# ఏపీ అసెంబ్లీలో జైళ్ల సంస్కరణల బిల్లుకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈరోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల 8వ రోజున రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత 'జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టగా, సభ దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అనిత, జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా సంస్కరణాలయాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, కేంద్రం నిర్దేశించిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ సంస్కరణలు అమలు చేస్తామని ఆమె ప్రకటించారు. జైలు గోడల మధ్య కూడా మానవీయ విలువలు కాపాడాలన్న ఉద్దేశంతో మహిళా ఖైదీల పిల్లల కోసం ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా వారిని కేటగిరీలుగా విభజించి, వారిలో మానసిక పరివర్తన తెచ్చేందుకు 'ఓపెన్ ఎయిర్ జైళ్ల'ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా వ్యవసాయం మరియు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, వారు చదువుకునేందుకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. జైళ్లలో సిబ్బంది కొరత, ముఖ్యంగా మహిళా సిబ్బంది లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన సభ దృష్టికి తెచ్చారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ ఖైదీలకు, చిన్న చిన్న కేసుల్లో ఇరుక్కున్న వారికి సత్ప్రవర్తన ప్రాతిపదికన క్షమాభిక్ష ప్రసాదించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో తాము కూడా జైలు అనుభవాలను చూశామని గుర్తు చేసుకుంటూ, ఖైదీలు విడుదలయ్యాక జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రభుత్వం



ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వివరణ అనంతరం బిల్లు ఆమోదం పొందడంతో, త్వరలోనే వందలాది మంది ఖైదీల విముక్తికి మార్గం సుగమం కానుంది.

# భారత్ ట్యాక్సీ'తో కనీస ఆదాయం'- క్యాబ్ డ్రైవర్లకు గుడ్ న్యూస్ చెప్పిన అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

అమూల్ మాదిరి సహకార మోడల్

భారత్ ట్యాక్సీని దేశంలో విజయవంతమైన సహకార సంస్థ అమూల్ నమూనాలో తీసుకొస్తున్నామని షా వివరించారు. రైతులు కలిసి అమూల్‌ను భారీ సంస్థగా తీర్చిదిద్దినట్లే, డ్రైవర్లు కలిసి ఈ ప్లాట్‌ఫారమ్‌ను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ సంస్థల్లో లాభాలు యజమానులకు వెళ్లిపోతే, ఇక్కడ మాత్రం సభ్యులకే తిరిగి చేరుతాయని అన్నారు.

డ్రైవర్లే భాగస్వాములు

కేవలం రూ.500తో షేర్ కొనుగోలు చేసి డ్రైవర్లు కంపెనీలో భాగస్వాములవుతారు. లాభాల్లో 80 శాతం డ్రైవర్లకు కిలోమీటర్ల ఆధారంగా పంపిణీ చేస్తారు. మిగిలిన 20 శాతం సంస్థ అభివృద్ధి కోసం నిల్వ ఉంచుతారు. కంపెనీ బోర్డులో కూడా డ్రైవర్లకు ప్రాతినిధ్యం ఉంటుందని తెలిపారు. వారి సమస్యలు నేరుగా పాలన స్థాయిలో వినిపించేలా వ్యవస్థ రూపొందించామని చెప్పారు.

మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్త సేవలు

ప్రస్తుతం దిల్లీ-ఎన్‌సీఆర్, రాజ్‌కోట్‌లలో సేవలు ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫారమ్‌ను మూడు సంవత్సరాల్లో దేశంలోని ప్రతి ప్రధాన నగరానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రారంభ దశలో కొంత సమయం పట్టినా, తర్వాత డ్రైవర్లకు లాభాలు స్పష్టంగా కనిపిస్తాయని షా తెలిపారు. మొదటి మూడు సంవత్సరాలు సహనం పాటించాలని కోరారు.

మహిళలకు 'సారథి దీదీ'

మహిళా ప్రయాణికుల భద్రత దృష్ట్యా యాప్‌లో సారథి దీదీ అనే ఫీచర్ తీసుకురానున్నారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు మహిళా డ్రైవర్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రయాణం కూడా సురక్షితంగా మారుతుందని చెప్పారు.

ఫిర్యాదు వ్యవస్థ, రుణాలు

డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఆన్‌లైన్, కాల్ సెంటర్, ప్రత్యక్ష కేంద్రాల ద్వారా మూడు స్థాయిల ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహన రుణాలు సహకార బ్యాంకుల ద్వారా సులభంగా అందిస్తారు. బీమా సేవలను ×ఖీఖీజూ టోకియో జనరల్ ఇన్సూరెన్స్‌తో భాగస్వామ్యంగా తక్కువ ప్రీమియంతో అందించనున్నారు.

కమిషన్ లేకుండా సేవలు

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఓలా, ఉబెర్, రాపిడో వంటి సంస్థలు డ్రైవర్ల ఆదాయంలో 2530 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. అయితే భారత్ ట్యాక్సీ మాత్రం డ్రైవర్ల నుంచి ఎలాంటి కమిషన్ తీసుకోదని స్పష్టం చేశారు. డ్రైవర్లు తమను తాము డ్రైవర్ గా కాకుండా సారథిగా భావించాలని షా సూచించారు.

ఏదైనా గౌరవప్రదమే: అమిత్ షా

కష్టపడి చేసే పని ఏదైనా గౌరవప్రదమేనని చెప్పారు. మొత్తంగా డ్రైవర్ల ఆదాయం, భద్రత, గౌరవం అనే మూడు అంశాలను కేంద్రంగా

# సంపాదకీయం

**యువ రచయితల ముందున్న మార్గం మునుపటి కంటే సంక్లిష్టం**

ప్రింట్ మీడియా నిస్సందేహంగా వెనుకంజ వేసింది. ఒకప్పుడు తెలుగు భాషనీ, సాహిత్యాన్నీ నిర్వచించి నిర్వహించిన పత్రికలు నేడు లేవు; అలాగే బాల్యదశ నుండీ పాఠకుల చేయిపట్టుకొని అభ్యుదయం వైపుగా నడిపించిన సోవియట్ సాహిత్యమూ లేదు. మరోవైపు గ్రంథాలయ వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఈ రెండు ధోరణులూ నెమ్మదిగానైనా పెరుగుతూ వస్తున్న గ్రామీణ అక్షరాస్యత నడుమ సంభవించడం ఒక విషాదం. కొత్త తరం అక్షరాస్యులకు ప్రింటు మీడియా సాహిత్యం అందుబాటు లేకుండా పోయింది; డిజిటల్ మీడియాని అందుకొనే స్తోమత, అవకాశాలూ కొద్దిమందికే ఏర్పడ్డాయి. ఇందుకు ప్రతిస్పందనగా పుస్తకాల 'తోపుడు బండి,' 'మరో గ్రంథాలయ ఉద్యమం' వంటి క్షేత్రస్థాయి ప్రయత్నాలు జరిగాయి; జరుగుతున్నాయి. ప్రభుత్వాల వైఫల్యాన్ని ఈ చెదురుమదురు ప్రయత్నాలు పూడ్చలేవు. ఇతర దక్షిణాది రాష్ట్రాలలోనూ, బెంగాల్, కేరళలలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నది. గ్రంథాలయాల అభివృద్ధికీ, సాహిత్యవికాసానికీ ఈ రాష్ట్రాలు, యావద్భారతదేశానికి మార్గదర్శకంగా నిలిచాయి. తెలుగు రాష్ట్రాల విద్యా విధానానికిగల ప్రత్యేకత సామాజిక శాస్త్రాలపై చిన్నచూపు. సాంకేతిక విద్యకు సముచిత స్థానం ఇవ్వడం సరైనదే అని భావించినా, ఈ రెండిటిమధ్యా పోటీ ఉండనవసరం లేదని పొరుగు రాష్ట్రాల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఈ ధోరణులన్నీ రాజకీయాలకు అతీతంగా, కేవలం పాలకుల అసమర్థత మూలంగానే చోటు చేసుకుంటున్నాయనుకుంటే అది అమాయకత్వం అవుతుంది. నేటి బుల్‌డోజర్ పాలనలో గ్రంథాలయాల నిధులను తొక్కిపెట్టడం, హిందీని బలవంతంగా రుద్దడం, సామాజిక శాస్త్రాల నుండి యువతరాన్ని దూరం పెట్టడం ఇవన్నీ ఒక పథకం ప్రకారమే జరుగుతున్నాయి. యువతరాన్ని సమాజానికీ, సమిష్టితత్వానికీ ఎడంగా, కేవలం వ్యక్తిగత విజయాలపైనే దృష్టి పెట్టేవారిగా కట్టడి చేయడం పాలకుల లక్ష్యం. పైన పేర్కొన్న అవలక్షణాలకు ప్రతిస్పందనగానే నేడు ద్రవిడ సాంస్కృతికోద్యమాలు బలపడుతున్నాయి. బుక్ బ్రహ్మ ఉత్సవానికీ, తదితర దక్షిణభారత భాషల సాహితీ కార్యక్రమాలకూ లభిస్తున్న ఆదరణ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, హిందీయేతర భాషలకు జాతీయస్థాయి సాహిత్య పురస్కారాలని ప్రకటించడం ఇవేవీ కాకతాళీయంగా జరిగిపోతున్న పరిణామాలు కాదు. ప్రముఖ దక్షిణాది నటులు ప్రకాష్ రాజ్ సాహిత్య సభల్లో చేస్తున్న ప్రసంగాలను, అలాగే కమల్ హసన్ పార్లమెంటులో శ్రీశ్రీని ఉటంకించడాన్ని కూడా ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి. నేటి యువతరం రచనలో కనిపిస్తున్న ధోరణులను ఈ వ్యాస లక్ష్యాల పరిధిలో పరికిస్తే, రెండు రకాల రచనలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటగా సాహిత్యం ఏకకాలంలో సాగే బాహ్యసమాజ సందర్శనం, అంతర్ముఖ ప్రయాణం అనుకుంటే నిబద్ధతతో కూడిన నేటి తరం చేస్తున్న రచలను శ్రద్ధగా పరిశీలించాలి. అవి చుట్టూ ఉన్న సంక్షోభ శకలాలతో తలపడుతూ, నిత్యం సంఘర్షిస్తూ రాసుకున్నవి; ఆధునిక సమాజపు అనిశ్చతలతోనూ, మానవసంబంధాల విఛ్ఛిన్నంతోనూ, అత్యంత వేగవంతంగా మారిపోతూన్న పరిస్థితులతోనూ తలపడుతూ రాసుకున్నవి. నగరజీవన ఆకర్షణలు పైపై తళుకుబెళుకులే అని వాళ్లకి తెలుసు. వాళ్లని నిలదీసేవి స్త్రీపురుష సంబంధాలు, లైంగికత్వం, పెళ్లి వీటి చుట్టూ పేరుకుపోయిన అస్థిరతలు. అనేక రకాల వివక్షలు ఆధారంగా నిర్మితమైన ప్రపంచం తన ఆధునిక రూపంలో సృష్టిస్తూన్న అసంబద్ధ అయోమయాలలో తామెవరో తెలుసుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు వారివి. ముందుతరంలో ఉండిన సుస్థిరతలు ఇప్పుడు లేవు. సంప్రదాయాలే మనకు శ్రీరామరక్ష అనిగాని, విప్లవమే అన్నిటికీ పరిష్కారం అనిగానీ ఎవరైనా అంటే అది వాళ్లకి ఆమోదయోగ్యం కాదు. యువతరం రచనల్లో దిక్కుతోచని విషాదం ఇమిడి ఉన్నది. ఇక రెండవ తరహా రచనలకు వొస్తే నేటి వాణిజ్య ప్రపంచపు విజయాలకు కొలమానాలైన తక్షణ కీర్తి, విశేషమైన ధనార్జన ఇవే వీటి పరమావధి. ఇవి సహజం గానే రూపసారాల్లో మార్కెట్ శక్తులతోనూ, సినిమా పరిశ్రమతోనూ ముడిపడి ఉంటాయి; ఆయా రచయితలు సినిమారంగ ప్రవేశానికై ఉవ్విళ్లూరుతుంటారు. రచనల్లో ఏముంది అనే చర్చకన్నా ఎన్ని కాపీలు అమ్ముడు పోయాయి? అనేదే చర్చాంశంగా నిలిచిపోతుంది. ఏ రచయిత అయినా ఎక్కువమంది పాఠకులను చేరుకోవాలనే అనుకుంటాడు. రచనలో సత్తా ఉంటే అది ఎప్పటికైనా చేరాల్సిన పాఠకులను చేరుకుంటుంది. ఏది ఏమైనా పాఠకుల సంఖ్య పెరగడం, సాహిత్య కార్యక్రమాలకు, పుస్తక ప్రదర్శనలకు పెద్దఎత్తున యువతీయువకులు హాజరుకావడం ఆహ్వానించాల్సిన పరిణామమే. పుస్తకపఠనం అలవాటుగా మారాలేగానీ, అది తనంటతానే పరిణితి చెందుతుంది. సినిమాలకు సాహిత్యంతో అవసరం ఎప్పుడూ ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ సినిమాల నిర్మాణానికి నవలలు, కథలు ఆధారంగా నిలిచాయి. అయితే అవేవీ సినిమా మాధ్యమాన్ని లక్ష్యంగా పెట్టుకొని చేసిన రచనలుకావు. ఉత్తమ సాహిత్యం యథాస్థితిని ప్రతిఘటిస్తుంది; కట్టు బాట్లని ప్రశ్నిస్తుంది. ఇతివృత్తపరంగానూ, శైలిలోనూ మూసపద్ధతిని వొదిలించుకొనే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. ఇందుకు తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉదా హరణలున్నాయి.

# అంపశయ్యపై సమాచార హక్కు!




'భారత ప్రజలకు సమాచార హక్కు అనేది పార్లమెంటు ఉదారంగా ఇచ్చిన వరం కాదు. అది 19(1)(ఎ)వ రాజ్యాంగ అధికరణ భరోసా ఇచ్చిన హక్కు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.కె.మాథ్యూ చరిత్రాత్మక తీర్పు వెలువరించారు. ప్రజాప్రతినిధులు తీసుకునే చర్యలు, చేపట్టే విధానాల గురించి తెలుసుకునే హక్కును ప్రజలకు ఈ అధికరణ కల్పిస్తోందని స్పష్టం చేశారు. కానీ, వాస్తవిక పరిస్థితుల్లో సమాచార హక్కు నీరుగారిపోతోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన భరోసాకు పార్లమెంటు 2005లో సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) రూపంలో చట్టబద్ధత కల్పించింది. ఫలితంగా పౌరులు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా మారారు. ఆర్‌టీఐ చట్టం పౌరుడిని ప్రజాస్వామ్యంలో సార్వభౌమాధికారం కలిగిన వ్యక్తిగా గుర్తించింది. పౌరులు కోరిన సమాచారం వెల్లడించడాన్ని తప్పనిసరి నియమంగా పరిగణించింది. చట్టంలోని 8వ సెక్షన్‌లో ఇచ్చిన 10 మినహాయింపుల కింద తప్ప మిగతా అన్ని సందర్భాల్లో పౌరులు కోరిన సమాచారాన్ని అధికారులు వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. అవినీతి, అధికార దుర్వినియోగం, నిరంకుశ పోకడలను ప్రశ్నించడానికీ, సంబంధిత సమాచారాన్ని డిమాండ్ చేయడానికీ పౌరులకు పది సందర్భాల్లో తప్ప మరే విధంగానూ అడ్డంకి లేదు.

తలకిందులైన చట్ట నిర్మాణం

వ్యక్తిగత సమాచార గోప్యతను ఆర్‌టీఐ చట్టం ఎన్నడూ విస్మరించలేదు. ప్రజా ప్రయోజనాలకు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం వెల్లడించాలని పేర్కొంది. ప్రజల ప్రయోజనాలతో ముడిపడి లేని వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవచ్చని సెక్షన్ 8(1)(జె) చెబుతోంది. పార్లమెంటు ఈ విషయంలో మరో అడుగు ముందుకేసింది. వ్యక్తిగత గోప్యతను నిర్వచించడంలో అధికారులు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో ఒక నిర్ణయాత్మక నిబంధనను చట్టంలో చేర్చింది. దాని ప్రకారం పార్లమెంటుకు కానీ, రాష్ట్ర శాసనసభకు కానీ ఇవ్వాల్సిన సమాచారాన్ని పౌరుడికీ ఇచ్చి తీరాలి. చట్టసభలకు ఇవ్వలేని సమాచారాన్ని పౌరులకూ ఇవ్వనవసరం లేదని స్పష్టీకరించింది. తద్వారా గోప్యతను ప్రజాస్వామిక జవాబుదారీతనంతో ముడిపెట్టింది. అయితే, ఈ రక్షణ కవచం తరవాత తుత్తునియలైంది. గిరీశ్ రామచంద్ర దేశ్‌పాండే కేసుతో ఆర్‌టీఐ సెక్షన్ 8(1)(జె)లోని 87 పదాల క్లాజు మొదటి ఆరు పదాలకు తగ్గిపోయి, వాటి ఆధారంగా సమాచార నిరాకరణకు అవకాశం చిక్కింది. దానివల్ల దాదాపు ఏ రికార్డునైనా సంబంధిత వ్యక్తితో ముడిపెట్టవచ్చు. దీంతో సమాచారాన్ని వెల్లడించే విషయంలో అధికారులకు విచక్షణాధికారం పెరిగింది. సమాచార వెల్లడి తగ్గింది. దీన్ని సరిదిద్దాల్సిన ప్రభుత్వం ఏకంగా ఆర్‌టీఐ చట్టాన్నే మార్చాలని నిశ్చయించింది. డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం ద్వారా సెక్షన్ 8(1)(జె)లోని 81 పదాలను తొలగించి, ఇప్పటికే నష్టం చేకూర్చిన మొదటి ఆరు పదాలను మాత్రమే ఉంచింది. వ్యక్తి అనే పదానికి విస్తృత నిర్వచనమిచ్చింది. ఇకపై వ్యక్తి (పర్సన్) అనే పదం పరిధిలోకి వ్యక్తులతోపాటు కంపెనీలు, సంఘాలు, ప్రభుత్వం కూడా వస్తాయి. దీంతో వీటికి సంబంధించిన అన్ని సమాచారాలు 'వ్యక్తిగతమైనవి'గా పరిగణన పొంది, సమాచార హక్కు పరిధి నుంచి మినహాయింపు పొందుతున్నాయి. ఇది ఆర్‌టీఐ చట్ట నిర్మాణాన్ని తలకిందులు చేయడమే. వ్యక్తిగత సమాచార గోప్యత చట్టం సమాచార వెల్లడిని నేరంగా పరిగణిస్తూ భారీగా జరిమానా విధించేందుకూ అవకాశమిస్తోంది. దీనివల్ల ప్రజాసమాచార అధికారి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడిస్తే చిక్కులపాలవ్వాల్సిందే. దీనివల్ల సమాచారం ఇవ్వకుండా మౌనందాల్చడమే సురక్షితమని అధికారులు భావిస్తారు. ఇక ఆర్‌టీఐ వల్ల వ్యక్తిగత గోప్యతకు, పరిపాలనకు ముప్పు వాటిల్లుతుందని 2026 ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేయడం ప్రభుత్వ వైఖరిని వెల్లడిస్తోంది. అనేక దేశాలు వ్యక్తిగత సమాచార వెల్లడిపై ఆంక్షలు విధించాయని ఆర్థిక సర్వే గుర్తుచేసింది. అయితే అవినీతిని అరికట్టడమే సమాచార హక్కు చట్టం లక్ష్యమన్న కీలకాంశాన్ని ఆర్థిక సర్వే విస్మరించింది. అవినీతి నిర్మూలనలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవ్వడం వల్లనే ఆర్‌టీఐ వంటి చట్టం అవసరం తలెత్తిందన్న సంగతిని గుర్తించడం లేదు. పౌరులను అవినీతి తనిఖీదారులుగా మార్చడం స.హ.చట్టం ప్రత్యేకత. దీనివల్ల అవినీతిపై నిఘా వికేంద్రీకృతమైంది. సమాచార హక్కువల్ల పరిపాలనకు విఘాతం కలిగినట్లు, అవినీతి పెరిగినట్లు దాఖలాలు లేవు. పైగా అధికారులను జవాబుదారీగా మారుస్తోంది.

గోప్యతకన్నా పారదర్శకతే ముఖ్యం

పుట్టస్వామి కేసుతో ఆర్‌టీఐ విషయంలో స్పష్టత వచ్చింది. 2017లో జస్టిస్ కె.ఎస్.పుట్టస్వామి (విశ్రాంత) వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 9 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అయితే రాజ్యాంగ నిర్మాణ సభ గోప్యతను, ముఖ్యంగా ఉత్తరప్రత్యుత్తరాల గోప్యతను రాజ్యాంగబద్ధం చేయాలనే ప్రతిపాదనపై చర్చించి తిరస్కరించిందని సుప్రీం తీర్పు గుర్తుచేసింది. రాజ్యాంగ నిర్మాణసభలో గోప్యత గురించి చర్చ జరిగినా, ఉద్దేశపూర్వకంగానే గోప్యతా హక్కును పక్కనపెట్టారన్నమాట. అయినా కూడా గోప్యతను ప్రాథమిక హక్కుగా ప్రకటించడం విశేషం. ఈ విషయంలో న్యాయపాలిక సృజనాత్మకతను కనబరిచినా, ఆర్‌టీఐ పరిధిని కుదించడం వల్ల లాభంలేకుండా పోయింది. తెలుసుకునే విషయంలో పౌరుడికి ఉన్న హక్కు నీరుగారిపోయింది. గోప్యత అంటే సార్వత్రిక నైతిక సూత్రమేమీ కాదు. ప్రజలు డిమాండ్ చేసినప్పుడు అధికారులు గోప్యతను పక్కనపెట్టాల్సిందే. ఇలాంటి సందర్భాల్లో ప్రజాస్వామ్యానికి గోప్యతకన్నా, పారదర్శకతే అవసరం. కానీ, ఇప్పుడు మనకు సంస్కరణకు బదులు తిరోగమనం కనిపిస్తోంది. సమాచారాన్ని తెలుసుకునే హక్కు (ఆర్‌టీఐ) కాస్తా, సమాచారాన్ని నిరాకరించే హక్కు(ఆర్‌డీఐ)గా మారిపోతోంది. ఈ మార్పు గుట్టుగా జరిగిపోతోంది. ప్రాథమిక హక్కులను ఒక్కసారిగా రద్దు చేయకుండా క్రమక్రమంగా నీరుగార్చే ప్రయత్నమిది. సమాచార హక్కు చట్ట పరిధిని ప్రజలకు తెలియకుండా నెమ్మదిగా కుదించి వేస్తున్నారు. గోప్యత ఎక్కడ ముగుస్తుంది, జవాబుదారీతనం ఎక్కడ మొదలవుతుంది అనే దానిపై దేశంలో చర్చ జరగాలి. లేకపోతే, సమాచార హక్కు చట్టం పేరుకే మిగులుతుంది. దాని ఆత్మ అంతరించిపోతుంది

# కళాకారులు.. మానవ హృదయ నిర్మాతలు..




ఈ పుస్తకానికి ప్రతీకాత్మకమైన శీర్షిక పేరు పెట్టడంలోనే కొత్తదనం కనబడుతుంది. మంచికవర్ పేజీ కాగితంతో, చక్కని కూర్పుతో అక్షర దోషాలు లేకుండా ఎంతో జాగ్రత్త తీసుకుని ఆకర్షణీయమైన చిన్న సైజు కవితా సంపుటిగా ఎన్నెల పిట్ట వారు ముద్రించారు.

## విప్లవ కవిత్వంలో స్థానాన్ని ఏర్పరుచుకొని..

ముందుమాట రాసిన విప్లవ కవి వరవరరావు గారి కొన్ని వాక్యాలను క్లుప్తంగా పేర్కొంటాను. ఈ కవిత్వానికి సమకాలీన ఆధునికత గుణాత్మకత ఎక్కడ వచ్చిందంటే 'నిరంతర ఆశల సౌధాలతో నడుస్తున్న సంఘర్షణల యుద్ధభూమి ఇది. సంకేతాల రాజ్యమిది. రహస్య సందేశాల స్థావరం'. పుస్తక రచయిత వసంత నెల్లుట్ల 50 సంవత్సరాల సబ్‌కాన్షియస్ నోస్టాల్జియా జ్ఞాపకాల సంఘర్షణతో సమన్వితమైన ఈ 'చివరాఖరి జవాబు'తో తన మొదటి కవితా సంపుటి ద్వారా ఆధునిక విప్లవ కవిత్వంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నారు.

## కవిత్వం హృదయ సమ్మిళితం!

కవిత్వ శీర్షిక ఆశయాన్ని వెల్లడిస్తుంది. కవిత్వమంతా కూడా హృదయ సమ్మిళితం. కవిత్వం ఎంతో భావ అనుభూతి కలిగిస్తూ ఆవేదన, ఆనందం, ఆలోచన, ఆవేశంతో ఉత్తేజితమవుతాము. తన కవిత్వంలోని సృజనాత్మకత, భావ పటిమతో రూపాంతరం చెంది వారి నిగూఢ అంతరంగాన్ని ఇందులోని కవితలు ఆవిష్కరించాయి. కార్పొరేట్ శక్తులకు, రాజకీయ – ఆర్థిక సామాజిక సాంస్కృతిక దోపిడీ వ్యవస్థలకి సవాలు చేయబడ్డాయి..

## సరళ పదబంధాలు..

పద ప్రయోగ చాతుర్యం, కవితా సంపుటిలోని ప్రత్యేకత. శిల్పం విషయానికి వస్తే, తనదైన సరళ శైలి మార్గంలో భాష పద బంధాలలో కనిపించే ప్రత్యేకత, భాష వివిధ భావ రూపాలతో చైతన్య పరుస్తూ స్ఫూర్తినిస్తాయి. కవిత్వం అర్థం చేసుకోవాలన్నా పూర్తిగా ఆనందించాలన్నా ప్రతీకలు తెలిసి వుండాలి. కవయిత్రి భావనలో ప్రకృతి ఎంత చైతన్యవంతంగా రూపుదిద్దుకుంటుందో 'నూతన స్వప్నాలు' అన్న కవితలో పువ్వులు దుఃఖించవు అవి వాటి పరిసరాలను దుఃఖాల నుండి మేల్కొలుపుతాయి అవి రాలిపోతూ కూడా రాగాలాపన చేస్తూ విశ్వ వ్యాప్తి చెందుతవి.

## జనాన్ని తట్టి లేపే చైతన్యం!

ఈ కవిత్వం అంతా కూడా ప్రపంచాన్ని తాత్వికంగా అన్వేషిస్తుంది. ఈ అన్వేషణ అనేక రకాల వివరణలతో ప్రశ్నలతో వస్తుంది. ఇది ఒక రకంగా మేధో మేలుకొలుపు. విశ్వాసాలతో పాటు శక్తివంతమైన అంతర్లీన సందేశాన్ని అందిస్తున్న కవిత్వం. అందుకే నేమో స్టాలిన్ అంటారు "కళాకారులు మానవ హృదయ నిర్మాతలు,కళ జానపద రీతులలో, సౌమ్యవాద భావాలతో విలసిల్లాలి". నిజమే! జనాన్ని తట్టి లేపే చైతన్యం కవిత్వంలో అంతర్లీనంగా వ్యక్తం అవుతుంది.

## మానవత్వంపై ప్రేమే కవిత్వం..

కామ్రేడ్ సాయిబాబా స్మృతిలో రాసిన మహోన్నతం కవితలో నీ కుర్చీని కాపాడుకోవడం మాత్రమే తెలిసిన నీకు మహోన్నత మానవ మేధావి చక్రాల కుర్చీ విలువేం తెలుసు అని ఈ ఫాసిస్ట్ పాలకులకు తన మౌనాన్ని ఛేదించుకొని ఒక మనిషిగా చేసిన హెచ్చరిక. 'బిగి పిడికిటి సందేశం' అనే కవితలో నిట్టూర్పులకు కన్నీళ్లకూ ఇది సమయం కాదు. అల్లంత దూరంలో ఆఖరి శ్వాస కూడా విడిచిన అమరుల పిడికిళ్లింకా బిగించే ఉన్నాయి నీ కోసం మనకోసం పదిల పరిచిన ఆ సందేశం అంటూ కవియిత్రి చిత్రించిన వాస్తవిక దృశ్యాలు మనల్ని నిలబెట్టి ఆలోచింప చేస్తాయి.

## దారి దీపాలు వెలిగించు..

వీరి సునిశిత దృష్టికి సాక్షులుగా అమరులైన విప్లవకారులు, యుద్ధాన్ని కొనసాగిస్తున్న విప్లవకారులు, నేటి సమాజానికి ప్రతినిధులుగా ఒకరి తర్వాత ఒకరు ప్రత్యక్ష మవుతారు. కవర్ పేజీలోని చివరి కవితా చరణాలు చదువుతున్నప్పుడు శివసాగర్ చారు బాబుపై రాసిన కవిత గుర్తుకు వస్తోంది. ఆ కవిత ప్రభావం కింద పేర్కొన్న కవితపై గాఢంగా కనిపిస్తోంది. నీ బిడ్డ వంటి అనేకమంది బిడ్డలు కోసం దారి దీపాలు వెలిగించు నీ గుండె గూడులో ఎప్పటి వలనే నన్ను కాపాడుకో వీరుడు గానే లేచి వస్తాను" అవును ఈ ప్రపంచం ప్రజలది – ప్రజల విముక్తి పోరాటాలు తప్పక జయించి తీరుతాయి అన్న ఆశావహ దృక్పథం ఈ కవిత్వం నిండా కనిపిస్తుంది. ముగించే ముందు చలం మ్యూజింగ్స్‌లో కమ్యూనిస్టుల పట్ల అన్న మాటలు గుర్తు చేసుకుంటూ.... "నా మనసు కమ్యూనిస్టుల కాళ్ల మీద పడుతోంది. నమ్మిన ఆశయాల కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా త్యజిస్తున్నారు." 75 సంవత్సరాల కిందట ఆయన అన్న మాటలు నిత్యనూతనమై నేటి పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

# నాలుగు పదుల కార్టూనిజం




వార్త చదవకముందే ఒక చిన్న కార్టూన్ మనల్ని ఆలోచనలో పడేస్తే, అది సుభానీ గీతే అయి ఉంటుంది. భారీ వ్యాసాలు, గంటల కొద్దీ ప్రసంగాలు అవసరం లేకుండా సింగిల్ కాలమ్ బాక్స్‌లో సమాజాన్ని నిలబెట్టి ప్రశ్నించగల శక్తి కార్టూన్‌కు మాత్రమే ఉంది. ఒకటి కాదు, రెండు కాదు.. ఆ శక్తిని గత 40 ఏండ్లుగా నిర్భయంగా చాటుతూ ప్రయాణం చేస్తున్న ఒకే ఒక్క తెలుగు కళాకారుడు సుభానీ. సుభానీ కార్టూన్లలో కేవలం హాస్యం, వ్యంగ్యం మాత్రమే కాదు. ఆ నవ్వు వెనుక దాగి ఉన్న సామాజిక వాస్తవాలను శక్తివంతంగా చూపిస్తాయి. రాజకీయాలు, పరిపాలన, సామాజిక వైకల్యాలు, సామాన్యుల కష్టాలు అన్నీ ఆయన గీతల్లో జీవం పోసుకుంటాయి. క్యాప్షన్ అవసరం లేని కార్టూన్లే ఎక్కువగా గీయడం ఆయన శైలి. నాలుగు దశాబ్దాల పత్రికా ప్రయాణం. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన డెక్కన్ క్రానికల్ దినపత్రికలో కార్టూన్ ఎడిటర్‌గా పనిచేస్తున్న సుభానీ రోజువారీ కార్టూన్ కాలమ్ కౌంటర్ పాయింట్ ద్వారా రోజూ లక్షలాది పాఠకులకు నవ్వులు పంచుతూ, రాజకీయ నాయకులకు చురకలు వేస్తూ పలుకరిస్తారు. ఏషియన్ ఏజ్ వంటి జాతీయ పత్రికలోనూ ఆయన కార్టూన్లు ప్రచురితమవుతున్నాయి. ఇప్పటివరకు 35,000కు పైగా కార్టూన్లు, 15,000కి పైగా ఇలస్ట్రేషన్లు, పెయింటింగ్స్ ఆయన గీశారు. వాటిలో కొన్ని ఎంపిక చేసి (440 కార్టూన్లు,40 క్యారికేచర్లు, 40 లైన్ డ్రాయింగ్స్) ఒక అందమైన ఆల్బమ్‌గా '40 టు ది పాయింట్' పేరున ప్రచురించారు. ప్రతిభకు వచ్చిన గౌరవం తన 40 ఏండ్ల కార్టూన్ జర్నీలో ఆయన చేసిన కృషికి ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డు, కార్టూన్ జర్నలిజంలో ప్రతిభకు బాపు అవార్డు, తెలుగు యూనివర్సిటీ పురస్కారంతోపాటు గ్రీస్, జర్మనీ, బెల్జియం, జపాన్, చైనా వంటి దేశాల్లో ఆయన కార్టూన్లు అంతర్జాతీయ కార్టూన్ ప్రదర్శనలకు ఎంపికై ప్రపంచ ప్రఖ్యాత కార్టూనిస్టుల ప్రశంసలు పొందాయి. సుభానీ కాలేజీలో చదువుతున్నపుడే పలు వారపత్రికల్లో సోషల్ కార్టూనిస్టుగా గుర్తింపు పొందారు. ఆ రోజుల్లోనే ప్రఖ్యాత కార్టూనిస్ట్ బాపు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సుభానీ జీవితానికి దిశానిర్దేశం చేసింది. సరళమైన గీత, ఘాటైన వ్యంగ్యం ఆయన గీతల్లో అతిశయోక్తి ఉండదు. మెత్తని మాటలతో సున్నితంగా చెణుకులు ఉంటాయి. రోజురోజుకూ పడిపోతున్న రూపాయి విలువ మీద ఆయన వేసిన కార్టూన్లు హృదయాలను తాకుతాయి. 40 ఏండ్ల క్రితం ఆయన గీతల్లో ఉన్న చైతన్యం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. శైలి మారలేదు. బ్రష్ వాడినా, నిబ్ వాడినా ఆయన రేఖలు, హ్యూమర్ ఒక పద్ధతిగా కుదురుగా ఉండటం ఒక ప్రత్యేకత. కార్టూన్ పాత్రల ముఖాల్లో స్పష్టమైన భావాలు, మాటల కంటే బలమైన దృశ్యండఆ కార్టూన్‌ను చూడగానే 'ఇది సుభానీ కార్టూనే కదా!' అనిపిస్తుంది.

## ఆదాబ్ హైదరాబాద్

హైదరాబాద్ నగర చరిత్ర, కల్చర్ సుభానీ కళలో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. హైదరాబాద్‌లో 18వ శతాబ్దం నాటి ఆసఫ్‌జాహీ నిజామ్‌లు నిర్మించిన విశిష్ట వారసత్వానికి ప్రతీకలు. మొఘల్, పర్షియన్, యూరోపియన్ శిల్పశైలుల సమ్మేళనంగా చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్, కింగ్ కోఠి వంటి అపురూప కట్టడాలు సుభానీ రేఖల్లో కొత్త సొగసులు దిద్దుకొని 'ఆదాబ్ హైదరాబాద్' పేరున ప్రత్యేక కార్టూన్ బుక్‌తో పాటు జేఎన్‌టీయూలో వాటి ఒరిజినల్ స్కెచ్‌లతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. అవి కళా ప్రపంచంలో విశేష గుర్తింపు పొందాయి.

# బ్లాక్ కిస్మిస్ తింటున్నారా - ఎలా తింటే ఆరోగ్యానికి మంచిదో తెలుసా

## బ్లాక్ కిస్మిస్ తో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు - పద్ధతి ప్రకారం తినాలంటున్న నిపుణులు



చాలామంది బాదం, కిస్మిస్, జీడిపప్పు వంటి డ్రై ఫ్రూట్స్‌ని పచ్చిగానే తింటుంటారు. కానీ, వీటిని నానబెట్టి తీసుకుంటే ఈ పదార్థాల్లోని పోషకాలు రెట్టింపయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ నానబెట్టిన బ్లాక్ కిస్మిస్ తీసుకోవడం తినడం వల్ల ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

రక్తహీనతకు చెక్ :

మహిళలకు నెలసరి, ప్రెగ్నెన్సీ సమయాల్లో శరీరం ఎక్కువ రక్తం కోల్పోతుంది. దీనివల్ల మహిళల్లో రక్తహీనత (ఖఅవఎఱఖ) తలెత్తుతుంది. అయితే, ఈ సమస్యకు బ్లాక్ కిస్మిస్ పరిష్కారం చూపుతుందని జీశీబతీఱశ్రీ శీట ఎాష్ట్రుతీఖఎవబ్ఱఖశ్రీ =వంముతీఎష్ట్ర ×త్వతీఱఫ్ఱశీఱఖశ్రీ ప్రచురించింది. ఇందుకు కారణం దీనిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందట. అయితే, వీటిని నేరుగా కంటే నానబెట్టుకొని తీసుకుంటే.. ఇందులోని ఐరన్‌ని శరీరం మరింత సులభంగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రక్తం పెరగడంతోపాటు అలసట, నీరసం దూరమై శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుందని తెలియజేస్తున్నారు.

హార్మోన్లు సమతులంగా :

హార్మోన్ల అసమతుల్యత చాలామంది మహిళలకు సమస్యగా ఉంటుంది. దీంతో నెలసరి క్రమం తప్పడం, సంతానలేమి, ప్రత్యుత్పత్తి సమస్యలు, మొటిమలు, అవాంఛిత రోమాలు రావడం వంటి దుష్ప్రభావాలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని దూరం చేసుకోవాలంటే నానబెట్టిన బ్లాక్ కిస్మిస్‌లను రోజూ ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు. వీటిలో ఉండే బి, సి, కె విటమిన్లు.. మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఖనిజాలు హార్మోన్లను ఉత్పత్తి చేసే అడ్రినల్ గ్రంథుల పనితీరును మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. తద్వారా హార్మోన్ల ఉత్పత్తి బ్యాలన్స్ అవుతుందని పేర్కొంటున్నారు. ఇది అటు శరీర ఆరోగ్యానికి, ఇటు మానసిక ఆరోగ్యానికి మంచిదట.

సంతాన భాగ్యం :

ప్రస్తుతం చాలామంది మహిళలు సంతాన లేమి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి బ్లాక్ కిస్మిస్ వరమంటున్నారు నిపుణులు. ఐరన్, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు అధికంగా ఉండే ఇవి ప్రత్యుత్పత్తి వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయని చీఫ్ఱశీఱఖశ్రీ ాఱఎతీఖతీఎ శీట వీవఎఱఎఱఅవ అధ్యయనం పేర్కొంది. తద్వారా సులువుగా గర్భం దాల్చే అవకాశాలు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. వీటిని నానబెట్టుకొని తినడం వల్ల గర్భాశయం పనితీరు మెరుగై, ఆరోగ్యకరమైన అండాలు విడుదలవుతాయని వివరిస్తున్నారు. అలాగే, ప్రెగ్నెన్సీ సమయంలోనూ ఆరోగ్యంగా ఉండేందుకు, గర్భస్థ శిశువులో న్యూరల్ ట్యూబ్ ఎదుగుదలకు ఇవి దోహదం చేస్తాయంటున్నారు.

ఎముక బలానికి :

వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకల బలం తగ్గిపోతుంటుంది. ఇక మెనోపాజ్ దశలోకి అడుగుపెట్టిన మహిళల్లో ఆస్టియోపొరోసిస్ కారణంగా ఈ సమస్య మరింత తీవ్రమవుతుందంటున్నారు నిపుణులు. అయితే నానబెట్టిన నల్ల ఎండుద్రాక్షను రోజూ తినడం వల్ల వీటిలో అధికంగా ఉండే క్యాల్షియంను శరీరం సులభంగా గ్రహిస్తుందని చెబుతున్నారు. తద్వారా ఎముకల దృఢత్వం పెరుగుతుందని తెలియజేస్తున్నారు. టీనేజీ నుంచే నానబెట్టిన నల్ల కిస్మిస్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వృద్ధాప్యంలో ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా జాగ్రత్తపడచ్చని వివరిస్తున్నారు.

మెరిసే చర్మానికి :

అందంగా మెరిసిపోవాలని చాలా మంది అమ్మాయిలు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, ఇందుకోసం బయట దొరికే సౌందర్య ఉత్పత్తులు వాడడం కంటే సహజసిద్ధమైన పదార్థాల్ని తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అందుకే, రోజువారీ ఆహారంలో బ్లాక్ కిస్మిస్‌లను చేర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. వీటిని రోజూ నానబెట్టి తీసుకోవడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుందని అధ్యయనం పేర్కొంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినోల్స్ అనేవి ఫ్రీరాడికల్ డ్యామేజ్ నుంచి చర్మాన్ని కాపాడి వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా చేస్తాయట. అలాగే, విటమిన్ 'సి' కొలాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మానికి మెరుపును తీసుకొస్తుందని పేర్కొంటున్నారు.

ఎన్ని తినాలి :

వీటితో పాటు జీర్ణశక్తిని మెరుగుపరచడానికి, తక్షణ శక్తికి, గుండె ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి, బరువును అదుపులో ఉంచుకోవడానికి.. నానబెట్టిన బ్లాక్ కిస్మిస్‌తో ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగని వీటిని అమితంగా తీసుకోవడమూ మంచిది కాదంటున్నారు. రోజూ రాత్రి పడుకొనే ముందు 6 నుంచి 10 బ్లాక్ కిస్మిస్‌లను అరకప్పు నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయాన్నే పరగడపున అవి తిని.. ఆ నీటిని తాగితే ఈ ఆరోగ్య ప్రయోజనాలన్నీ సొంతమవుతాయని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ

# స్త్రీల మెదడుపై ఎఫెక్ట్ చూపిస్తున్న లింగ వివక్ష.. ఏకంగా నాలుగు దశల్లో..

## లింగ వివక్ష అనేది బాల్యం నుంచే పిల్లల మెదడులోకి ఎక్కిస్తుంది సొసైటీ. దీని కారణంగా మగాళ్లు అంటే బలం.. ఆడాళ్లు అంటే బలహీనతగా వివరించబడుతుంది.



ఇండియాలో లింగ వివక్ష అనేది డప్పు కొట్టి ప్రకటించబడదు. సైలెంట్‌గా వచ్చేస్తుంది. బ్రెయిన్‌లోకి ఎక్కేస్తుంది. డిన్నర్ టైంలో నీ పక్కన కూర్చుని.. 'ఇంత వయసొచ్చింది ఇంకా ఎందుకు పెళ్లి చేసుకోలేదు?' అని అడుగుతుంది. స్కూల్‌లో అబ్బాయిల ఆత్మవిశ్వాసం గురించి పొగుడుతూ.. అమ్మాయిల విధేయత గురించి ప్రశంసిస్తుంది. ఆఫీసులో స్త్రీలు రెట్టింపు పని చేసి.. కాస్త ఫైర్ అయినా.. మీరు చిరునవ్వుతోనే ఉండాలని చెప్తుంది. కాలక్రమేణా అది బయటి సమస్యగా కాకుండా మనసులోనే పెద్ద సమస్యగా మారిపోయి పాతుకుపోతుది. అందుకే సెక్సిజం కేవలం సామాజిక ఇబ్బంది మాత్రమే కాదు మెంటల్ కండిషనింగ్ సిస్టమ్ అంటున్నారు నిపుణులు. బ్రెయిన్ పదే పదే ఇలాంటి సంఘటనలకు ఎక్స్‌పోజ్ అయిన కారణంగా.. దానికి అనుగుణంగా మారిపోతుంది. కాగా ఇక్కడ భారత స్త్రీల మెదడును సైలెంట్‌గా కంట్రోల్ చేసే నాలుగు దశలు ఉన్నాయని చెప్తున్నారు ఎక్స్‌పర్ట్స్.

ప్రారంభంలో మెంటల్ కండిషనింగ్

సరిగ్గా కూర్చో.. గట్టిగా మాట్లాడకు.. చీకటి పడితే బయట ఉండకు.. వేరేవాళ్ల దృష్టిని ఆకర్షించకు.. పుట్టిన ఆడపిల్లలు తమ పేరును కూడా నేర్చుకోకముందే ఈ లింగ వివక్ష పరిచయమవుతుంది. డెవలప్‌మెంటల్ సైకాలజీలో దీన్ని జెండర్డ్ కండిషనింగ్ అంటారు. ఇది చిన్నతనం నుండే మొదలవుతుంది. ఎదిగే వయసులో పదే పదే వినిపించే ఈ మాటలు సురక్షితత్వం, విలువ, గుర్తింపు గురించిన కోర్ నమ్మకాలను రూపొందిస్తాయి. అబ్బాయిలను కొత్తగా అన్వేషించమని ప్రోత్సహిస్తే.. అమ్మాయిలను సెల్ఫ్ రిస్ట్రిక్ట్ చేయమని నేర్పిస్తాయి. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ ప్రచురించిన పరిశోధన ప్రకారం.. అమ్మాయిలు అబ్బాయిల కంటే ముందుగా ఈ భయాన్ని ఇంటర్నల్‌గా ఇముడ్చుకుంటారు. భారతదేశంలో ఈ కండిషనింగ్ మరింత తీవ్రంగా ఉంటుంది. అమ్మాయిలకు వారి ప్రవర్తనపైనే సెక్యూరిటీ ఆధారపడి ఉంటుందని నేర్పిస్తారు. ఏదైనా తప్పు జరిగితే.. 'ఆమెకు ఏమైంది?' అని అడగరు. ఆ సమయంలో ఎలాంటి బట్టలు వేసుకుంది? ఎక్కడికి వెళ్లింది? ఎందుకు ఒంటరిగా ఉంది? అని అడుగుతారు. న్యూరాలజికల్‌గా.. ఇది హైపర్‌విజిలెన్స్‌ను క్రియేట్ చేస్తుంది. మెదడులో భయానికి కేంద్రమైన అమిగ్డాలా అతిగా యాక్టివ్ అవుతుంది. దీని ఫలితంగా అమ్మాయిల్లో దీర్ఘకాలిక ఆందోళన, రెండోసారి ఆలోచించడం, పర్యావరణాన్ని నిరంతరం స్కాన్ చేయడం వంటి అలవాటు వచ్చేస్తుంది. చాలా మంది భారతీయ మహిళలు పబ్లిక్ స్పేస్‌లలో రిలాక్స్ కాలేరు ఎందుకంటే వారి బ్రెయిన్‌కు పబ్లిక్ స్పేస్‌లు వారికి చెందినవని ఎవరూ చెప్పలేదు. అదో ప్రమాదకరమైన స్థలంగానే పరిగణిస్తారు.

వాచ్ మెన్ అయిపోవడం

సంవత్సరాల తరబడి ఇలా ఉండాలి అలా ఉండకూడదు అని తీర్పు చెప్పబడడం.. సరిచేయబడడం.. హెచ్చరించబడడంతో.. మహిళలు ఒక ప్రమాదకరమైన మెంటల్ ట్రిక్ నేర్చుకుంటారు. తమను తాము ఒకటికి పదిసార్లు చూసుకోవడం మొదలుపెడతారు. దీన్ని ఇంటర్నలైజ్డ్ సెల్ఫ్ సర్వైలెన్స్ అంటారు. దుస్తుల నుంచి మొదలుపెడితే ఆశయాలు వరకు.. ఎలా నవ్వాలి నుంచి స్టార్ట్ చేస్తే ఎవరితో స్నేహం చేయాలనే నిర్ణయం వరకు.. కోపం వచ్చినా సరే ఎక్స్‌ప్రెస్ చేస్తే బాగుంటుందా లేదా అని ఆలోచించడం వరకు.. ప్రతిదీ మానిటర్ చేసుకుంటారు. ప్రపంచం వేలెత్తి జడ్జ్ చేయకముందే.. తమను తాము ఎడిట్ చేసుకుంటారు. ఇది ఎప్పుడూ ఆఫ్ కాని ఓ అంతర్గత జఙఎ కెమెరా లాంటిది. ప్రముఖ సైకాలజిస్ట్ దీన్ని మహిళలు తమకు తాము ఓ బయటి వ్యక్తిగా చూసుకోవడం.. నిరంతరం ఇతరులకు ఎలా కనిపిస్తున్నారో అంచనా వేయడంగా చెప్తున్నారు. కాగా ఈ పద్ధతి చాలా మంది భారతీయ మహిళల్లో ఇంపోస్టర్ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. అంటే ఓ పని చేస్తే కచ్చితంగా సక్సెస్ అవుతారని తెలిసినా.. బయటి వ్యక్తులు ఏమనుకుంటారోననే సంకోచం ఎదురవుతుంది.

అడ్జస్ట్‌మెంట్.. ఒకే ఒక్క థెరపీ

ఇంట్లో అడ్జస్ట్ అవ్వు... పెళ్లి విషయంలో సర్దుకుపో... కంఫర్ట్ లేకపోయినా వర్క్ చేయు.. అబ్యూజ్మెంట్ జరిగినా సైలెంట్ అయిపో.. ఇవి అమ్మాయిలకు వినిపించే మాటలు. అంటే భారతీయ మహిళలు ఒక శక్తివంతమైన పదం వింటూ పెరుగుతారు.. అదే అడ్జస్ట్‌మెంట్. న్యూరోసైన్స్ ప్రకారం ఈ అడ్జస్ట్మెంట్ అనేది.. దీర్ఘకాలిక భావోద్వేగ అణచివేత. కాగా ఇది కార్టిసాల్ స్థాయిలను పెంచుతుంది. మెమరీ, భావోద్వేగ నియంత్రణ కేంద్రమైన హిప్పోకాంపస్‌ను దెబ్బతీస్తుంది. ఫలితంగా బ్రెయిన్ ఫాగ్, భావోద్వేగ నిస్సారత, మోటివేషన్ లేకపోవడం.. నిరంతర ఓవర్‌వెల్మ్ భావన వస్తాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం... భారతీయ మహిళలు పురుషుల కంటే దాదాపు రెండు రెట్లు డిప్రెషన్‌కు గురవుతారు. కానీ సహాయం కోరే అవకాశం చాలా తక్కువ.

సంస్థలు సెక్సిజాన్ని ఎలా సపోర్ట్ చేస్తాయి

సెక్సిజం వ్యక్తిగత వైఖరులపై మాత్రమే బతకదు. కాగితంపై న్యూట్రల్‌గా కనిపించే.. ప్రాక్టీస్‌లో వివక్షపూరితంగా ఉండే సంస్థలు దీనికి మద్దతు ఇస్తాయి. కార్యాలయంలో చట్టం టెక్నలాజికల్‌గా ఉంది. కానీ సైకాలజీ వేరే కథ చెబుతుంది. 1997లో విశాఖ గైడ్‌లైన్స్, 2013లో ూూఎ యాక్ట్ మహిళలకు సురక్షితమైన ప్రొఫెషనల్ వాతావరణాన్ని సృష్టించడానికి ఉద్దేశించబడ్డాయి. కాగితంపై ఈ చట్టాలు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలు, నిర్దిష్ట సమయంలో పరిష్కారాన్ని ఇవ్వాలని ఆదేశిస్తాయి. కానీ చాలా మంది మహిళలు రిటాలియేషన్ భయం, క్యారెక్టర్ అసాసినేషన్, డిఫికల్ట్ అని లేబుల్ చేయబడే భయంతో హ్యారస్‌మెంట్‌ను రిపోర్ట్ చేయరు. మెదడు ఈ రిస్క్‌ను స్పష్టంగా అంచనా వేస్తుంది. సర్వైవల్ జస్టిస్ కంటే ఈ భయం వెంటాడుతుంది. అంతెందుకు భారతదేశంలో మ్యారిటల్ రేప్ ఇంకా నేరంగా గుర్తించబడలేదు. ఎందుకంటే చట్టం వివాహంతో ఫుల్ పర్మిషన్ ఇస్తుందనే ఫీలింగ్ ఇంకా ఉంది. '× ఎశీ' అనేది లైఫ్ టైమ్ పర్మిషన్ స్లిప్ లాంటిది. ఈ చట్టపరమైన బ్లైండ్ స్పాట్ ప్రైమరీ సైకాలజీని విస్మరిస్తుంది. నిజానికి సమ్మతి ఒక్కసారి జరిగే సంఘటన అవుతుందా భయం, ఒత్తిడి, బాధ్యతతో చేసే ఇంటిమసీ.. ఇంటిమసీ అవుతుందా? అది ఒక ట్రామా.

ప్రెషర్ కుకర్ ఎఫెక్ట్

నిజానికి దీన్ని భారతీయ మహిళలు నేర్చుకున్న 'ప్రెషర్ కుకర్ ఎఫెక్ట్' అని పిలవచ్చు. లోపలి భావోద్వేగాలను లోపలే ఉంచమని.. గట్టిగా మూత పెట్టమని.. ఫ్లేమ్‌ను అడ్జస్ట్ చేయమని.. చిరునవ్వుతో ఉండమని నేర్పించడం ఇది. కానీ మన చుట్టూ ఉన్నవారు విజిల్ కోసం ఎదురుచూస్తూ ఉంటారు చివరికి అది వస్తే.. ఎందుకు ఇంత ఎమోషనల్‌గా ఉన్నావు అంటారు. నిజానికి ఇది ఓవర్ రియాక్ట్ కాదు. నరాల వ్యవస్థ చిన్నప్పటి నుంచి శిక్షణ పొందిన విధంగానే స్పందిస్తుంది.

# హోమ్ లోన్ పూర్తైనా బ్యాంకులు ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వలేదా రోజుకు రూ.5వేలు పరిహారం పొందొచ్చు!

## - లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు తనఖా పెట్టిన పత్రాలు తిరిగి ఇవ్వాలని ఆర్బీఐ రూల్స్- లేని పక్షంలో ఫైన్ కట్టాల్సిందే!

సొంతిల్లు అనేది ప్రతీ ఒక్కరి కల. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో కష్టపడుతుంటారు. అయితే, సంపాదించిన డబ్బులు సరిపోక చాలా మంది హోమ్‌లోన్స్‌పై ఆధారపడుతుంటారు. ఈ మేరకు బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థల నుంచి కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుని నెలనెలా కొంత డబ్బు చెల్లిస్తుంటారు. అయితే, హోమ్ లోన్ క్లియర్ అయిన తర్వాత కూడా బ్యాంకులు కొన్ని పత్రాలను అందజేయడానికి కాస్త టైమ్ తీసుకుంటాయి. కానీ మీకు తెలుసా రూల్స్ ప్రకారం లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు పత్రాలను కస్టమర్‌కు తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వని పక్షంలో బ్యాంక్ పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం. హోమ్ లోన్ తీసుకునే ముందు తాకట్టు కింద బ్యాంకులు కొన్ని పత్రాలను తీసుకుంటాయి. మీరు ఏయే పత్రాలను సమర్పించారో లోన్ మంజూరు సమయంలో బ్యాంకు వాటి వివరాలను మీకు తెలియజేస్తుంది. లోన్ క్లోజ్ చేయగానే అవన్నీ బ్యాంకు నుంచి తీసుకోవాలి. ఏ ఒక్కదాన్నీ బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీలు అట్టిపెట్టుకునే అధికారం లేదు. దీనికి సంబంధించి 2023లో నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది ఆర్బీఐ.

టైమ్ లిమిట్ దాటితే పరిహారం : దాని ప్రకారం.. లోన్ పూర్తిగా చెల్లించిన 30 రోజుల తర్వాత కస్టమర్ ఆస్తి పత్రాలను (చర లేదా స్థిరాస్తుల పత్రాలు) తిరిగి ఇవ్వడంలో లేదా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఛార్జ్ తొలగింపు ఫారమ్ దాఖలు చేయడంలో ఆలస్యం జరిగితే, ఆ ఆలస్యానికి గల కారణాలను =జు (రెగ్యులేటెడ్ ఎంటిటీ - అంటే బ్యాంక్ లేదా ఫైనాన్స్ సంస్థ) కస్టమర్‌కు తెలియజేయాలి. ఒకవేళ ఆ ఆలస్యం బ్యాంకు నిర్లక్ష్యం వల్ల జరిగితే, ఆలస్యమైన ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున కస్టమర్‌కు పరిహారం చెల్లించాలి. ఉదాహరణకు మీరు జనవరి 20 తేదీన లోన్ క్లియర్ చేశారని అనుకుంటే ఫిబ్రవరి 18వ తేదీలోపు బ్యాంకులు మీ పత్రాలను తిరిగి ఇవ్వాలి. అలా జరగని పక్షంలో ఫిబ్రవరి 19 నుంచి రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా వర్తిస్తుంది. ఈ రూల్ డిసెంబర్ 1, 2023 తర్వాత లోన్ క్లోజ్ అయిన అన్ని కేసులకూ వర్తిస్తుంది. ఆస్తి పత్రాలు పోయినా: కేవలం సమయానికి అందించడమే కాకుండా చర, స్థిరాస్తి పత్రాలు పాక్షికంగా లేదా పూర్తిగా పోయినట్లయితే దాని బాధ్యత కూడా బ్యాంకులే చూడాలి. పరిహారం చెల్లించడంతోపాటు డూప్లికేట్ లేదా సర్టిఫైడ్ కాపీలను పొందడానికి అయ్యే మొత్తం ఖర్చును బ్యాంకే భరించాలి. ఈ ప్రక్రియలో కస్టమర్‌కు ఆర్థికంగా ఎటువంటి భారమూ పడకూడదు. డూప్లికేట్ పత్రాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెప్పించే మొత్తం ప్రక్రియకు బ్యాంక్ సహకరించాలి. అవసరమైన లీగల్ ఖర్చులను కూడా భరించాలి. అయితే పత్రాలు పోయినట్లు ధ్రువీకరించిన తర్వాత, డూప్లికేట్ పత్రాలు సేకరించడానికి బ్యాంకుకు అదనంగా 30 రోజుల(మొత్తం 60 రోజులు) సమయం లభిస్తుంది. ఈ 30 రోజులు దాటిన తర్వాత కూడా పత్రాలు అందించలేకపోతే, అప్పుడు ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన హోమ్ లోన్లతో పాటు కార్ లోన్లు, గోల్డ్ లోన్లు సహా అన్ని రకాల సెక్యూర్డ్ పర్సనల్ లోన్లకు వర్తిస్తుంది. కాగా లోన్ క్లియర్ అయిన తర్వాత బ్యాంకులు లేదా రుణ సంస్థలే మీకు డాక్యుమెంట్లు పంపాలని ఆశించొద్దు. మీరే స్వయంగా వెళ్లి తీసుకోవడం మంచిది. ఎందుకంటే పత్రాలన్నీ ఉన్నాయా వాటిలో ఏవైనా పేజీలు మిస్సయ్యాయా స్వయంగా చూసుకుంటేనే మేలు. లేదంటే మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అలాగే పత్రాలన్నీ తీసుకున్నట్లు సంతకం చేసే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం కూడా మర్చిపోకూడదు. ఒకవేళ ఏ బ్యాంకు అయినా ఈ 30 రోజుల గడువును పాటించకపోతే, కస్టమర్లు ఆ జరిమానా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. బ్యాంక్ సరైన సమాధానం ఇవ్వని పక్షంలో కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే హక్కు కస్టమర్‌కు ఉంటుంది.

# గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి...

## మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి ఎరవెల్లి ముత్యం రావు...






పెద్దపల్లి//ఫిబ్రవరి 23 ఆకాంక్ష : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారికి గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యం రావు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పలు డిమాండ్లు ఉంచారు.పెద్దపల్లి జిల్లాలో దాదాపు 1500 మంది పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు గ్రామాల పారిశుభ్రతను కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, వారికి పని భద్రత లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను పెంచి, జనవరి 2025 నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2018లో జీఓ నెం.51 ద్వారా వేతనాలు పెంచినప్పటికీ, అదే సమయంలో ప్రవేశపెట్టిన మల్టీపర్పస్ వర్కర్ విధానం కార్మికులకు భారంగా మారిందన్నారు. ఈ విధానం వల్ల పాత కేటగిరీలు రద్దయి, ఏ పని అయినా చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ప్రమాదాలు పెరిగి అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు తగిన పరిహారం అందకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీఓ నెం.51 సవరణతో పాటు మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దుపై తీర్మానం చేయాలని, పంచాయతీ కార్మికులందరికీ రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. గత 56 సంవత్సరాలుగా పని చేస్తున్న పలువురు కార్మికుల పేర్లు నమోదు చేయకుండా వదిలేయడంతో వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, 10 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని నూతనంగా ఎన్నికైన సర్పంచులు కార్మికులను వేధింపులకు గురి చేస్తూ, ఇష్టానుసారంగా తొలగింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ చర్యలపై ప్రభుత్వం జోక్యం చేసుకుని సంబంధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేసి చెల్లించాలని, పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సేవలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండి ఖాజా, జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య, జంగపల్లి నరేష్, అశోక్, పైడిపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శులు తిట్ల శ్రీనివాస్, వేల్పుల భాస్కర్, రెడ్డిమల్ల నాగేశ్వర్,శాతరాజుల గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వైద్య సంపత్, పంగ భాస్కర్, అప్సర్, ఆసంపల్లి చంద్రయ్య, లక్ష్మణ్, రాజేశం, శారద, స్వప్న, సదానందం, కనుకయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన...

## కులం పేరుతో పసిబిడ్డ హత్య చేసిన దురహంకారులను కఠినంగా శిక్షించాలి: కల్లెపల్లి అశోక్...




పెద్దపల్లి//ఫిబ్రవరి 23 ఆకాంక్ష : నాగర్ కర్నూలు జిల్లా తుమ్మేరా గ్రామంలో కుల దురహంకారంతో రెండు నెలల పసిపాపను హత్య చేసిన ఘటనపై పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ కులం పేరుతో పసిపాపను క్రూరంగా హత్య చేయడం అమానుషమని, బాధ్యులైన గ్రామ పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి తక్షణమే రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు.నాగర్ కర్నూలు జిల్లా తుమ్మేరా గ్రామానికి చెందిన రజక కుటుంబంపై ఆలయంలో వివక్షత చూపుతూ రూ.100 టికెట్ తీసుకోవాలని చెప్పగా, రసీదు ఇవ్వాలని అడిగినందుకు మూడు గంటల పాటు తోపులాట జరిగిందని తెలిపారు. ఈ సమయంలో గణేష్‌పై మూకుమ్మడిగా దాడి చేసి, అతన్ని చితకబాదారని, అతని భార్య మౌనిక వేడుకున్నప్పటికీ వినకపోగా, రెండు నెలల పసిపాపను కూడా కాళ్లతో తన్నడంతో పాప అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఈ ఘటన కుల వివక్ష ఎంత ఘోరంగా ఉందో చూపిస్తోందని అన్నారు.దేవాలయాలు అందరికీ సమాన హక్కులతో ఉండాలని, మతోన్మాదం, కుల దురహంకారం వల్ల ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కెవిపిఎస్ తరఫున డిమాండ్ చేశారు.కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మోదుంపల్లి శ్రవణ్ మాట్లాడుతూ ఆలయ కమిటీలు అభివృద్ధికి తోడ్పడాల్సినప్పటికీ కులం పేరుతో చిన్న కులాల వారిని గుడిలోకి రానివ్వకుండా ఇబ్బందులు పెట్టడం దారుణమని విమర్శించారు. గ్రామాల్లో కులాంతర విభేదాలను గుర్తించి కుల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు కొంకటి లింగమూర్తి, లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు సిపెల్లి దిలీప్, అరికిళ్ల రామలక్ష్మి, సూరాజ్, మోజెస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ...






నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 23 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ జిల్లాలో క్షయ వ్యాధి బాధితుల ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారం కిట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, బిజినేపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎస్బీఐ సౌజన్యంతో భవిష్య భారత్ ఆధ్వర్యంలో ఈ కిట్లను పంపిణీ చేశారు.క్షయ వ్యాధి కారణంగా రోగులలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల రోగులు మరింత బలహీనతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్లు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగుల శరీర బలం పెరుగుతుందని, మందులతో పాటు సరైన ఆహారం తీసుకుంటేనే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని సూచించారు. ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నదని వివరించారు.అలాగే నాగర్ కర్నూల్, బిజినేపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో పలు రకాల పోషకాహార పదార్థాలు ఉండి రోగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఫిక్, డాక్టర్ విష్ణు, బిజినేపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శివ కుమార్, డాక్టర్ నరేష్ కుమార్, రిపోర్టింగ్ ఆఫీసర్ మినహాజ్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సజ్జదు ఆలీ సమన్వయం చేయగా, భవిష్య భారత్ డిప్యూటీ మేనేజర్ కరుణాకర్, శ్రీకాంత్, సూపర్వైజర్లు శ్రీనివాసులు, గౌరీ కుమార్, ప్రమోదు, గంగా సేవలు అందించారు. చంద్రశేఖర్, రాధా, విశ్వక్, గంగా, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.రోగులు మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలని, మధ్యలో చికిత్స ఆపకూడదని వైద్యులు అవగాహన కల్పించారు. సమాజం సహకారంతోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమని తెలిపారు.పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ కార్యక్రమం ద్వారా క్షయ రోగులకు నూతన ఆశ కలిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# కుమ్మెర ఘటన నిందితులను వెంటనే శిక్షించాలి...

## అంబేద్కర్ సంఘం డిమాండ్...



జడ్చర్ల//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న దారుణ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప ప్రాణాలు బలయ్యిన సంఘటనపై బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని మిడ్జిల్ అంబేద్కర్ సంఘం డిమాండ్ చేసింది. ఈ ఘటనలో పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేద్కర్ సంఘం సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.మిడ్జిల్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దేవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ, కుల ద్వేషం, వివక్ష ఇంకా సమాజంలో కొనసాగుతుండటం అత్యంత బాధాకరమని అన్నారు. దేవాలయ దర్శనానికి వెళ్లిన ఒక సాధారణ కుటుంబంపై దాడి చేసి, అమాయక పసిపాప ప్రాణాలను బలి తీసుకోవడం మానవత్వాన్ని త్రొక్కిన ఘటనగా పేర్కొన్నారు. ఇలాంటి దారుణ ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.సంఘం నాయకులు మాట్లాడుతూ, కుమ్మెర గ్రామంలో జరిగిన ఈ ఘటనలో బాధ్యులైన అగ్రవర్ణాల వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి, న్యాయపరంగా గరిష్ఠ శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, భద్రత కల్పించాలని, అలాగే ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణకు తీసుకువెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా వినతిపత్రం స్వీకరించిన తహసీల్దార్, సంఘం నాయకులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు బాలయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, రవీంద్ర, శేఖర్, ప్రభుదాస్, అశోక్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. కుమ్మెర ఘటనపై సమాజంలోని అన్ని వర్గాలు స్పందించి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు.ఈ ఘటనపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కుల వివక్షకు వ్యతిరేకంగా కఠిన చట్టాలు అమలు చేసి, సామాజిక సమానత్వం సాధించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. పసిపాప ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటనకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని అంబేద్కర్ సంఘం స్పష్టం చేసింది.

# పసిపాప మృతి ఘటనపై ఆగ్రహం...

**బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నేత ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్...**




పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా కమ్మెర గ్రామంలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతి చెందడం అత్యంత విషాదకరమని బీసీ జేఏసీ నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిని వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుమ్మెర కొండపై ఉన్న మల్లన్న ఆలయాన్ని కొందరు పెత్తందారులు తమ ఆధీనంలో ఉంచుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటూ సామాన్య భక్తులను వేధిస్తున్నారని పేర్కొన్నారు.చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించు కోకుండా, దాడి చేసిన వారిచే ఇచ్చిన ఫిర్యాదును ముందుగా పరిగణనలోకి తీసుకోవడం కుల వివక్షకు నిదర్శనమని విమర్శించారు. సీఎం సొంత జిల్లాలోనే బహుజనులపై దాడులు జరుగుతున్నా ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని మండిపడ్డారు.ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయం అందించాలని ఆకుల స్వామి వివేక్ పటేల్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రజక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రామ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసాని లెనిన్, టీఆర్‌పీ పార్టీ రాష్ట్ర నాయకుడు గుండవేన స్వామి యాదవ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి సందీప్, కేవీపీఎస్ నాయకులు శ్రావణ్, కళ్లపల్లి అశోక్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మీడియా ప్రజల గొంతుకగా నిలవాలి....

**తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం ఫౌండర్, చైర్ పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి**



ఉప్పల్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** ఉప్పల్ ప్రాంతంలో మీడియా ప్రజల సమస్యలకు ప్రతిధ్వనిగా నిలిచి, నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం ఫౌండర్, చైర్ పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి పిలుపునిచ్చారు. ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఆమె ఘనంగా సన్మానించి అభినందించారు. సోమవారం ఉప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మీడియా క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి నిజమైన సమాచారం చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.మీడియా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించాలని, ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో మీడియా ప్రతినిధులు నిర్మాణాత్మకంగా సహకరించాలని ఆమె కోరారు. ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ చేపట్టే మంచి కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మిషాది ముబారక్ చెక్కుల పంపిణీ....

**పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరం... ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు**



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణ లక్ష్మిషాది ముబారక్ పథకం నిజంగా వరంగా మారిందని పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎలిగేడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు మొత్తం ₹28,03,248 విలువైన కళ్యాణ లక్ష్మిషాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ 201314 సంవత్సరంలో తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని తరువాత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని, కానీ పథకం మూలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సంక్షేమంఅభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని, గ్రామాలలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన మద్దతు దానికి నిదర్శనమని తెలిపారు.ఎలిగేడు మండలంలో 12 సర్పంచ్ స్థానాలలో 11 కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం, పెద్దపల్లిసుల్తానాబాద్ మున్సిపాలిటీలలో కూడా కాంగ్రెస్ మరియు రెబల్ అభ్యర్థులు భారీగా గెలుపొందడం ప్రజల విశ్వాసాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్రీ బస్సు, రైతులకు సన్నవడ్లకు బోనస్, నిరుపేదలకు ఎల్.ఓ.సీ ద్వారా వైద్యం, ఇందిరా ఇండ్లు, రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవనోపాధిని మెరుగు పరుస్తున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా

# నేడు విద్యుత్ సరఫరా అంతరాయం..



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ అమర్చుటకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో నేడు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు బిజినపల్లి మండల విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసాచారి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని వెల్లడించారు. మరమ్మతుల పనులు వేగవంతంగా పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.బిజినపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు, వ్యాపారులు, గృహ వినియోగ దారులు ఈ అంతరాయాన్ని గమనించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, మరమ్మతుల పనులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు

# భారీ వాహన డ్రైవర్లకు 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం....




పెద్దపల్లి//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** రహదారి ప్రమాదాల నివారణకు,ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లలో బాధ్యతను పెంపొందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' (ూతీతీఱఙవ ూశ్రీఱఙవ) రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం రెండవ దశను సోమవారం ఘనంగా నిర్వహించారు. బసంతనగర్ టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భారీ వాహన డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యంగా భారీ వాహనాల వల్ల సంభవించే ప్రమాదాలపై దృష్టి సారించారు. డ్రైవర్లలో క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. లేన్ క్రమశిక్షణలో భాగంగా, భారీ మరియు నెమ్మదిగా నడిచే వాహనాలు ఎల్లప్పుడూ రహదారికి ఎడమ వైపు లేన్‌లోనే ప్రయాణించాలనీ సూచించారు. లేన్‌లను క్రమబద్ధంగా పాటించడం ద్వారా ట్రాఫిక్ సాఫీగా సాగడమే కాకుండా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అలాగే వాహనాలను అధిగమించే సమయంలో కేవలం కుడి వైపు నుంచే ఓవర్‌టేక్ చేయాలని, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ముందున్న వాహనాన్ని దాటే ముందు తగినంత దూరం పాటించడం, భద్రతా జాగ్రత్తలు తీసుకోవడం, వేగ నియంత్రణ, మత్తు పదార్థాల ప్రభావంలో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని ట్రాఫిక్ అధికారులు డ్రైవర్లకు వివరించారు.ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తూ, రహదారులపై భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజా వర్ధన్, లారీ డ్రైవర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులను మర్యాద పూర్వకంగా

# కలిసిన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య....



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** పెద్దపల్లి మున్సిపాలిటీ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య సోమవారం పెద్దపల్లి పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన మల్లయ్యకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు చైర్మన్ మల్లయ్యను పూల బొకేలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో పట్టణ అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలందించడంపై చర్చించారు.ఈ సందర్భంగా ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో మున్సిపాలిటీ మరియు పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకమైన పాలన అందించాలనే దిశగా మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య మాట్లాడుతూ, పెద్దపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించాలని కోరారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో కలిసి పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష దారుణం...

## పసికందు ప్రాణం తీసిన ఘటనపై బీసీ జేఏసీ ఆగ్రహం...



పెద్దపల్లి//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మర గ్రామంలో చోటుచేసుకున్న కుల వివక్ష దారుణంలో రెండేళ్ల పసికందు ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలిస్తోంది. అగ్రవర్ణాల అహంకారానికి బీసీ వర్గానికి చెందిన రజక కుటుంబం బలికావడం అత్యంత హేయమైన చర్యగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనకు నిరసనగా సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ, కేవలం వంద రూపాయల టికెట్ కొనలేమని చెప్పిన కారణంతో స్థానిక కాంగ్రెస్ సర్పంచ్ మరియు మరికొందరు అగ్రవర్ణ వ్యక్తులు ఒక బీసీ కుటుంబంపై కులం పేరుతో దూషిస్తూ దాడికి దిగారని ఆరోపించారు. ఈ దాడిలో మహిళపై



అమానుషంగా ప్రవర్తించి, బట్టలు చింపివేయడంతో పాటు, రెండు సంవత్సరాల చిన్నారిని కాళ్లతో తొక్కడం వల్ల ఆ పసికందు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంతటి ఘోరం జరిగినా పోలీసులు బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, పసిబిడ్డను కోల్పోయిన తల్లి దండ్రులపైనే అక్రమ కేసులు నమోదు చేయడం తీవ్ర ఆక్షేపణీయమని ఆమె మండిపడ్డారు. నిందితులపై ఇప్పటి వరకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు.తక్షణమే నిందితులపై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, నిందితులకు మద్దతు ఇస్తున్న పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హైకోర్టు జోక్యం చేసుకుని న్యాయ విచారణ జరపాలని, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.బాధితులకు న్యాయం జరగని పక్షంలో ప్రతి గ్రామం, ప్రతి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని బీసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి లక్ష్మణ్, బొడ్డుపల్లి రామ్మూర్తి, బీసీ జేఏసీ నాయకులు నల్లవెల్లి శంకర్, కొండి సతీష్, అలువాల రాజేందర్, మహిళా అధ్యక్షురాలు సిరవైన స్వప్న, కొమరయ్య, రవి, సాగర్, రాహుల్, శ్రీను, శ్రావణ్, శ్రీనివాస్, ఆముదాల అరుణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో శిథిలావస్థలో పాత నీటి ట్యాంక్...

## వెంటనే తొలగించాలని గ్రామ ప్రజల డిమాండ్...




ఓదెల//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** ఓదెల గ్రామంలో ఉన్న పాత ఎత్తైన నీటి ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఏ క్షణమైనా కూలిపోవచ్చనే భయంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ పొరలు ఊడిపోవడం, ఇనుప రాడ్లు బయటపడటం, మెట్లు కుళ్లిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తుండటంతో ట్యాంక్ స్థితి అత్యంత దారుణంగా మారింది. గ్రామానికి కొత్తగా నిర్మించిన నీటి ట్యాంక్ ద్వారా ప్రస్తుతం తాగునీటి సరఫరా జరుగుతుండగా, పాత ట్యాంక్‌ను పూర్తిగా ఉపయోగించటం నిలిపివేశారు. అయినప్పటికీ శిథిలావస్థలో ఉన్న ఈ నిర్మాణాన్ని అలాగే వదిలేయడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఆ ట్యాంక్ అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఉండటంతో చిన్నపిల్లలు, తల్లిదండ్రులు భయంతో జీవిస్తున్నారు.అంగన్వాడీకి వచ్చే చిన్నారులు, సమీప ఆరోగ్య కేంద్రానికి వచ్చే మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ఆ ప్రాంతం గుండా వెళ్లాల్సి వస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గాలి వేగాలు పెరగడం, వర్షాకాలంలో మరింత నష్టం కలిగే అవకాశాలు ఉండటంతో ఈ ట్యాంక్ మరింత ప్రమాదకరంగా మారుతుందని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు.గ్రామ ప్రజల మాటల్లో చెప్పాలంటే, "ఇప్పటికే ఉపయోగంలో లేని పాత ట్యాంక్‌ను అలాగే వదిలేయడం నిర్లక్ష్యానికి నిదర్శనం. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?" అని ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా పలు మార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న పాత నీటి ట్యాంక్‌ను పూర్తిగా కూల్చివేసి తొలగించాలని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం సంభవించిన తరువాత చర్యలు తీసుకోవడం కాకుండా, ముందస్తు జాగ్రత్తగా వెంటనే స్పందించి ట్యాంక్‌ను తొలగించాలని కోరుతున్నారు. గ్రామ ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, శిథిలావస్థలో ఉన్న ట్యాంక్‌ను తొలగించే దిశగా చర్యలు తీసుకుంటారా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొలువుదీరారు....

## ఘనంగా ప్రమాణ స్వీకారం...



కొత్తగూడెం//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికైన కార్పొరేటర్లు సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కమిషనర్ కె. సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన ఎనిమిది మంది కార్పొరేటర్లువేల్పుల వీరమ్మ, మల్హోత్రా సాగర్, భీమా శ్రీవల్లి, గుగులోత్ రాంబాబు, మల్లెల స్వప్న, సింధు తపస్వి, బత్తుల మధుచంద్, గుణ చరిత్‌వారి చేత కమిషనర్ సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రజల ఆశలను నెరవేర్చేందుకు సమష్టిగా పని చేయాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం బీఆర్ఎస్ కార్పొరేటర్లకు ఘన సన్మానం జరిగింది. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచన మేరకు స్థానిక పార్టీ నేతలు కార్పొరేటర్లకు శాలువాలు కప్పి, పూల బొకేలు అందజేసి సత్కరించారు. అదే విధంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్‌లను కూడా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్,సయ్యద్ ఇస్మాయిల్, బీమా శ్రీధర్, మల్లెల రవిచంద్ర, కాంపెల్లి కనకేష్, కొట్టి వెంకటేశ్వర్లు, బొమ్మిడి రమాకాంత్, బొమ్మిడి శ్రీకాంత్, రాజేష్ (కన్ని), సంకు బాపన అనుదీప్, ముత్యాల రాజేష్, కరాటే శ్రీనివాస్ యాదవ్, బట్టు మంజల, వీరన్న, డాబా శంకర్, దుర్గాప్రసాద్, వాసుమల్ల గౌతం తదితరులు పాల్గొన్నారు. కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారంతో స్థానిక పాలనలో కొత్త ఉత్సాహం నెలకొంది. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కార్పొరేటర్లు కీలక పాత్ర పోషించాలని నేతలు ఆకాంక్షించారు.

# జడ్చర్లలో ఘనంగా బీరప్ప పండుగ



జడ్చర్ల//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష :** జడ్చర్ల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో భక్తిశ్రద్ధల మధ్య బీరప్ప పండుగ ఘనంగా నిర్వహించబడింది. జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ గ్రామంలో మరియు మిడ్జిల్ మండలంలోని బైరంపల్లి గ్రామంలో జరిగిన ఈ వేడుకలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పండుగలో పాల్గొని గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మధ్య కలసి సంప్రదాయ కార్యక్రమాలను వీక్షిస్తూ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామాభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి పండుగలు కీలకమని ఆయన పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎర్ర శేఖర్ లక్ష్మారెడ్డి కూడా పాల్గొని భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో మమేకమై పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.



పండుగ సందర్భంగా గ్రామాల్లో సంప్రదాయ నృత్యాలు, హారతులు, బలి కార్యక్రమాలు, సామూహిక అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బీరప్ప స్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

# ప్రజావాణి కార్యక్రమంలో 50 ఫిర్యాదులు....

## వెంటనే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 50 ఫిర్యాదులు స్వీకరించామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం సమక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్, వాటిని ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు వ్యక్తపరచిన సమస్యలను తక్షణమే పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సమయానికి పరిష్కరించి దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి శాఖకు సంబంధించిన సమస్యలను సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన వినతులపై చేపట్టిన చర్యలను ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని, ప్రతి అర్జీపై క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ త్వరితగతిన పరిష్కారం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ 5 ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం సూచనలు...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విన్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం 5 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో భూమికి సంబంధించిన అర్జీలు 3, మరియు తగు న్యాయం విషయాలకు సంబంధించిన 2 అర్జీలు ఉన్నాయని అధికారులు తెలిపారు. డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఫిర్యాదుల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐ, సి.ఐ లతో ఫోన్ ద్వారా సంప్రదించి సమస్య స్థితిని తెలుసుకొని, తక్షణ పరిష్కారానికి సూచనలు చేశారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు భయంలేకుండా, మూడో వ్యక్తుల హస్తక్షేపం లేకుండా, స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగిస్తూ, సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే, పోలీస్ శాఖ ప్రజలకు మరింత దగ్గరగా ఉండి, శాంతి భద్రతలను కాపాడుతూ ముందుకు సాగడం లక్ష్యమని తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించింది.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో

# మెరిసిన జిల్లా పోలీస్ అధికారులు...

## ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందనలు....



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని జి.ఎం.సి బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలలో జోన్7 జోగులాంబ జోన్ తరపున పాల్గొన్న నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ అధికారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు గౌరవం తీసుకువచ్చారు.లాన్ టెన్నిస్ నాన్ గెజిటెడ్ పోలీస్ ఆఫీసర్స్ టీం ఈవెంట్ విభాగంలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఆర్ఐ జగన్, ఆర్ఎస్ఐ శివాజీ, గౌస్‌లు సమిష్టిగా అద్భుత ఆటతీరుతో మూడవ స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. పోటీలు ప్రారంభం నుండి చివరి వరకు క్రమశిక్షణతో కూడిన ఆటతీరు, పట్టుదల, సమన్వయం ప్రదర్శిస్తూ ప్రతిభ చూపిన ఈ జట్టును జిల్లా పోలీస్ శాఖ ప్రశంసించింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ విజేతలను అభినందిస్తూ, క్రమశిక్షణతో కూడిన సాధన, దృఢ సంకల్పంతోనే ఈ విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా మెడల్స్ సాధించి నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జిల్లా పోలీస్ కార్యాలయం తరపున విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడల ద్వారా పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు.

# కుమ్మెర జాతరలో పసిబిడ్డ హత్య...

## ఘటనపై సీఎం స్పందించాలని సిపిఎం డిమాండ్...



నాగర్ కర్నూల్ టౌన్ //ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా రెండు నెలల పసిబిడ్డను అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి బాధితులకు భరోసా ఇవ్వాలని, సంఘటనపై మౌనం వహించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించాలని కోరారు.సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ధర్నా శిబిరం వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జాన్ వెస్లీ మాట్లాడుతూ, అగ్రకుల పెత్తందారులైన శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్నిరెడ్డి తదితరులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతో పాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.జాతరలో దేవాలయంలోకి వెళ్లేందుకు రూ.100 ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన గణేష్ అనే యువకుడిని సుమారు మూడున్నర గంటల పాటు దారుణంగా కొట్టారని ఆయన ఆరోపించారు. తన భర్తను కొట్టవద్దని వేడుకున్న గణేష్ అక్క కీర్తి, భార్య మౌనికలు ఎంతగా ప్రాధేయపడినా నిందితులు కనికరం చూపలేదని, చివరకు రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని హత్య చేశారని తీవ్రంగా విమర్శించారు.ఈ ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని, నాలుగు రోజులు గడిచినా నిందితులందరినీ అరెస్టు చేయక పోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని జాన్ వెస్లీ అన్నారు. ఎనిమిది మందిపై ఫిర్యాదు చేసినప్పటికీ నలుగురినే అరెస్టు చేసి మిగతా వారిని కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే హత్యా నేరం కింద సెక్షన్ 103 చేర్చి మిగతా నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్ష, అంటరానితనం విస్తరిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే డీజీపీ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్, జిల్లా కార్యదర్శి వర్ధన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందికొండ గీత, ఆంజనేయులు, దేశ్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, నరసింహ, శివ వర్మ, అశోక్, తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు...

**పారదర్శకంగా నిర్వహణకు అన్ని శాఖల సమన్వయం...**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాలు...**




నాగర్ కర్నూల్, **ఫిబ్రవరి 23 ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లాలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాదావత్ సంతోష్ తెలిపారు. మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో విద్య, పోలీస్, రెవిన్యూ, వైద్య ఆరోగ్య, తపాలా, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం తొలిసారిగా ప్రతి పరీక్షకు మధ్య నాలుగు రోజుల విరామం ఉండటం విద్యార్థులకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ విరామాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు తగిన విద్యా మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించబడతాయని, ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 10,683 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో 5,264 మంది బాలురు, 5,394 మంది బాలికలు ఉన్నారు. జిల్లాలోని 257 ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల మరియు ఇతర మాధ్యమాల పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్షా కేంద్రాలకు, తిరిగి పరీక్షా కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్‌కు పరీక్షా సామగ్రి తరలింపులో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను సూచించారు.అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు, జవాబు పత్రాలను భద్రంగా తరలించేందుకు తపాలా శాఖ సహకరించాలని, దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.ప్రతి విద్యార్థి పరీక్షా సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు మరియు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డిఎస్పి శ్రీనివాసులు, డిఇఓ రమేష్ కుమార్, డిపిఓ శ్రీరాములు, డీఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్, ఏసీ రాజశేఖర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష...

గోదావరిఖని//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 7 మందిని పోలీసులు పట్టుకున్నారు.పట్టుబడిన వారిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ సమక్షంలో హాజరుపరచగా, ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.12,000 చొప్పున జరిమానా విధించారు. అయితే ఒక వ్యక్తి ఇదే నేరంలో రెండోసారి పట్టుబడటంతో అతనికి కోర్టు 3 రోజుల జైలు శిక్ష విధించింది.తదుపరి చర్యలలో భాగంగా శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై మరింత కఠినంగా చర్యలు కొనసాగిస్తామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో

# మంథని విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన...



మంథని రూరల్/ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మంథనికి చెందిన జె.కె.ఏ షోటోఖాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్స్ సాధించి జిల్లా గౌరవాన్ని పెంచారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21 నుండి 23 వరకు జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో కోంద్ర నాగరాజు ఇన్స్ట్రక్టర్ ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.పోటీల్లో సీనియర్ విభాగంలో 55 కిలోల కుమితే కేటగిరీలో బొడ్డేళ్ల ఇంద్రాణి సిల్వర్ మెడల్ సాధించగా, జూనియర్ విభాగంలో 61 కిలోల కుమితే కేటగిరీలో దుల్లచ్ దేవాన్ష్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.15,000 నగదు బహుమతి కూడా అందజేయబడింది.ఈ సందర్భంగా విజేతలను జె.కె.ఏ సౌత్ జోన్ ఇంచార్జ్ రాపోలు సుదర్శన్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, తెలంగాణ పేటా ఉపాధ్యక్షుడు కొమురోజు శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మంథని ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఈ క్రీడాకారులు మరింత కృషితో జాతీయ స్థాయిలో కూడా మెరిసే స్థాయికి ఎదగాలని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నూతనంగా ఎన్నికైన మేయర్,

# డిప్యూటీ మేయర్ లకు ఘనంగా సత్కారం...



గోదావరిఖని//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో నూతనంగా ఎన్నికైన మేయర్,డిప్యూటీ మేయర్ మరియు కార్పొరేటర్లకు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, 2వ డివిజన్ కార్పొరేటర్ వెంగల బాపుని, 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబామూర్తిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు బందారి రాజమల్లు మాట్లాడుతూ, నూతన ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బూర్ల దామోదర్, గౌరవాధ్యక్షులు సిరిమల్లె జయరాములు, సలహాదారులు సిరిపురం నర్సయ్య, అనుమ సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు వంగ వీరస్వామి, మాజీ కోశాధికారి కొండి లక్ష్మీపతి, ఉపాధ్యక్షులు కానుగంటి నారాయణ, దీకొండ సత్యనారాయణ, ఆడెపు రాజమౌళి, సిరిపురం రమేష్, గోలి నాగేశ్వర్ రావు, గద్దము జానకి రాములు, జెల్ల రాజేందర్, ఆడెపు రవి, వేముల మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘం నాయకురాళ్లు ధౌటం శాంత, పోరండ్ల శారద, యువజన సంఘం అధ్యక్షుడు మాటేటి సతీష్, ప్రధాన కార్యదర్శి బొద్దుల వేణు, కోశాధికారి తాటికొండ రవీందర్ సహా పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరై నూతన ప్రజాప్రతినిధులను అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# జడ్చర్లలో 600 ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూముల కబ్జ...

## బీఆర్ఎస్ నేతపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు...



జడ్చర్ల//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : జడ్చర్ల నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీలకు చెందిన సుమారు 600 ఎకరాల భూములను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు అక్రమంగా కబ్జా చేశాడని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పక్కా ఆధారాలు త్వరలోనే ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా కొండకల్, మోకిలా ప్రాంతాల్లో గిరిజనులకు చెందిన మరో 1100 ఎకరాల భూములను కూడా అదే నాయకుడు కబ్జా చేశాడని పేర్కొన్నారు. ఈ భూ కబ్జా వ్యవహారాలపై తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడానని, నేరస్తులు త్వరలోనే జైలుకు వెళ్తారని హెచ్చరించారు. బాలానగర్ మండలం పెద్దాయిపల్లి గ్రామంలో రూ.50 లక్షల ముడా నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన హయాంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఇసుక అక్రమ రవాణా విస్తృతంగా జరిగిందని, ఆ సమయంలో ఎన్ని కేసులు నమోదు చేశారో, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎన్ని కేసులు నమోదు చేశామో అన్ని ఆధారాలతో ప్రజలకు వెల్లడిస్తానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులు, కుంటలలో అక్రమ లేఅవుట్లకు అనుమతులు ఇచ్చారని విమర్శించిన ఆయన, అలాంటి లేఅవుట్లన్నింటినీ రద్దు చేయిస్తానని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు, డ్రైనేజీలు లేకుండానే పర్మిషన్లు ఇచ్చిన రియల్ ఎస్టేట్ వెంచర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాలపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రజల ముందుకు వచ్చి వివరణ ఇవ్వాలని సూచించారు.జడ్చర్ల నియోజకవర్గానికి రావాల్సిన ముడా నిధులను గతంలో మళ్లించారని విమర్శించిన ఎమ్మెల్యే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.10 కోట్ల ముడా నిధులను తీసుకొచ్చామని, మరో రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయని వివరించారు. పెద్దాయిపల్లి గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీ కోసం రూ.50 లక్షలు కేటాయించామని తెలిపారు. అదే విధంగా పెద్దాయిపల్లి ప్రాంతంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్, రూ.50 కోట్లతో నవోదయ పాఠశాల మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు.ం

# జడ్చర్లలో బిజెపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం....



జడ్చర్ల//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని మిడ్జిల్ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిజెవైయం జిల్లా అధ్యక్షుడు పల్లి తిరుపతి, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల ప్రతినిధులు, ముఖ్యమంత్రులు హాజరవుతున్న ఈ సమ్మిట్ ద్వారా దేశ భద్రత, పౌరుల ఉద్యోగ భద్రత వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తూ దేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వైఖరిని తీవ్రంగా ఖండించారు.కామారెడ్డి ప్రాంతంలో కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ వర్గం చేసిన దౌర్జన్యాలను ప్రస్తావిస్తూ, బిజెపి నాయకులను అడ్డుకోవడం, పోలీసు వ్యవస్థను ఉపయోగించి అక్రమ కేసులు పెట్టే ప్రయత్నాలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. పరామర్శకు వెళ్తున్న బిజెపి నాయకులను అడ్డుకోవడం, కేసులు బనాయించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని పాలన వైఖరి బయటపడుతోందని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అభివృద్ధి లక్ష్యంగా 2047 నాటికి వికసించిన భారతదేశాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ రాజకీయ లాభాల కోసం బిజెపి నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. 2029లో తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, శేఖర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్, మండల నాయకులు దేవేందర్, కావాలి నరేష్, అనిల్, నారాయణ, నాగయ్య, నవీన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా గాయత్రి విద్యానికేతన్

# 'ఆనందోత్సవ్-2026' వార్షికోత్సవ వేడుకలు...





పెద్దపల్లిటౌన్ **ఫిబ్రవరి 23 ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గాయత్రి విద్యానికేతన్ హైస్కూల్ 19వ వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సవ్-2026' పేరుతో అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ సాంస్కృతిక సమ్మేళనం వేలాది మంది తల్లిదండ్రులు, విద్యార్థులతో కళకళలాడింది. విద్యార్థుల అద్భుత నృత్య ప్రదర్శనలు, రంగురంగుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రేక్షకుల ఉత్సాహం మధ్య ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమానికి గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సమిష్టిగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థులు ఆలపించిన స్వాగత గీతం కార్యక్రమానికి శుభారంభం పలికింది. 8వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన కాళీమాత నృత్యం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆపరేషన్ సింధూర్' అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం దేశభక్తి స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ అందరినీ ఆలోచింపజేసింది. రైతుల కష్టసుఖాలను చూపిస్తూ చేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను కదిలించాయి. సమాజంలోని విభిన్న అంశాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ముద్ర వేశాయి.సుమారు నాలుగు వేల మందికి పైగా పాల్గొన్న ఈ మహోత్సవంలో ప్రాథమిక విభాగం విద్యార్థుల తల్లులు స్టేజ్‌పై నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి ఉత్సాహ భరిత ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి చప్పట్లు వెల్లువెత్తాయి.తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసికట్టుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈకార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మొత్తం కార్యక్రమం ఆద్యంతం ఆనందోత్సాహ భరిత వాతావరణంలో వైభవంగా కొనసాగి, హాజరైన ప్రతి ఒక్కరికి చిరస్మరణీయ అనుభూతిని అందించింది.

# పెద్దరాత్ పల్లి శిశువుల ఘటన...

## మాతా శిశు ఆసుపత్రికి సంబంధం లేదని అధికారుల స్పష్టత...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 23 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా పెద్దరాత్ పల్లి గ్రామంలో శిశువులు మిస్సింగ్ అయ్యారన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపథ్యంలో జిల్లా మాతా శిశు ఆసుపత్రి (వీజఎ) అధికారులు కీలక స్పష్టత ఇచ్చారు. ఈ ఘటనకు ఆసుపత్రికి ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.గ్రామంలో శిశువులు కనిపించకుండా పోయారన్న సమాచారం అందిన వెంటనే స్త్రీ శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ విచారణలో మిస్సింగ్ అయ్యారని భావించిన శిశువులు తమ తల్లిదండ్రుల వద్దే సురక్షితంగా ఉన్నట్లు వెల్లడైంది.తదుపరి చర్యలలో భాగంగా సంబంధిత శిశువులను మరియు వారి తల్లిదండ్రులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట ప్రవేశపెట్టారు. కమిటీ ఆదేశాల మేరకు శిశువుల మెరుగైన సంరక్షణ కోసం వారిని కరీంనగర్‌లోని శిశుగృహానికి తరలించారు.ఈ ఘటనపై పూర్తి వాస్తవాలు వెలికితీయాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయబడినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని వార్తలు ప్రచారం చేయవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే ప్రజలు నమ్మాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కూలీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యం...

### రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



గోదావరిఖని//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : కూలీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని శ్రమ జీవుల కష్టాన్ని అర్థం చేసుకుని వారికి అవసరమైన సదుపాయాలు అందేలా కృషి చేస్తాం అని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి మండలం జయ్యారం గ్రామంలో పర్యటించారు. అనంతరం మనాలి ఠాకూర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రత కలగాలని ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే శాసనసభ్యులు మీా రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో గ్రామీణాభివృద్ధి, కూలీల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉపాధి హామీ పనులు పారదర్శకంగా,సమర్థవంతంగా జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామస్తులు, కూలీలు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చొరవపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా మచిలీపట్నంలో లోన్ యాప్ వేధింపులు

### అప్పుల బారిన పడి సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య....



మచిలీపట్నం//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : ఇంటి అద్దె, పిల్లల చదువులు, రోజువారీ ఖర్చులుడ కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న ఓ సాధారణ సెక్యూరిటీ గార్డు జీవితం అప్పుల బారిన పడి విషాదాంతమైంది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో వెలుగు చూసిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ మచిలీపట్నం సమీపంలోని కాసానిగూడెంకు చెందిన వీడే గిరీష్ కుమార్ అనే యువకుడు ఒక ప్రైవేట్ కంపెనీలో అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా వ్యక్తిగత అవసరాల కోసం ప్రైవేట్ లోన్ యాప్ ద్వారా కొంత మొత్తం అప్పుగా తీసుకున్నాడు. ప్రారంభంలో సాధారణంగా కనిపించిన ఈ అప్పు తర్వాత గిరీష్ జీవితాన్ని నరకంగా మార్చింది.అప్పు తీసుకున్న కొద్ది రోజులకే లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు మొదలయ్యాయి. వడ్డీలకు వడ్డీలు వేసి భారీ మొత్తాన్ని డిమాండ్ చేయడంతో పాటు, చెల్లింపుల కోసం పదేపదే కాల్స్ చేసి మానసికంగా వేధించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అసభ్యకరమైన వాట్సాప్ సందేశాలు పంపుతూ, బంధువులకు ఫోన్ చేసి పరువు నష్టం కలిగించేలా ప్రవర్తించారని వారు తెలిపారు. అసలు తీసుకున్న అప్పుకు మించి భారీ మొత్తాన్ని చెల్లించాల్సిన పరిస్థితి రావడంతో గిరీష్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.ఈ వేధింపులను తట్టుకోలేక గిరీష్ తీవ్ర మనస్థాపానికి లోనై చివరకు ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లోన్ యాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లోన్ యాప్‌ల ద్వారా జరుగుతున్న వేధింపులపై ఫిర్యాదులు పెరుగుతున్నాయి. అవసరాల కోసం తీసుకున్న చిన్న అప్పు అనేక కుటుంబాలను శాశ్వత చీకటిలోకి నెట్టేస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా మచిలీపట్నంలో జరిగిన ఈ సంఘటన మరోసారి ప్రజల్లో భయం, ఆవేదనలను రేకెత్తించింది.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా...



మంచిర్యాల//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేశారనే ఆరోపణల మధ్య రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. మంచిర్యాల జిల్లా జైలులో ఉన్న సుమన్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడానికి గడువు కావాలని కోర్టును కోరారు. పోలీసుల అభ్యర్థనను పరిశీలించిన కోర్టు, బెయిల్ పిటిషన్‌పై తుది వాదనలను రేపటికి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బాల్క సుమన్ బెయిల్‌పై నిర్ణయం మరికొన్ని రోజులు వాయిదా పడింది.ఇదిలా ఉండగా జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలుచుకున్నప్పటికీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అడ్డంకులు సృష్టించారని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు, ప్రభుత్వాన్ని నిలదీసిన బాల్క సుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.గత వారం రోజులుగా మంచిర్యాల జిల్లా జైలులో ఉన్న బాల్క సుమన్‌కు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చి పలు ప్రాంతాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సుమన్‌కు వెంటనే బెయిల్ మంజూరు చేసి విడుదల చేయాలని పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## హుజూరాబాద్‌లో బీజేపీ నిరసన....

### అక్రమ అరెస్టులపై మండిపాటు...



హుజురాబాద్//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని బీజేపీ హుజురాబాద్ పట్టణ శాఖ అధ్యక్షుడు తూర్పాటి రాజు తీవ్రంగా విమర్శించారు. బీజేపీ హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అక్రమ అరెస్టులను నిరసిస్తూ సోమవారం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తూర్పాటి రాజు మాట్లాడుతూ ఒకవైపు బీజేపీ ఎమ్మెల్యేలపై దాడులు,మరోవైపు హిందువులపై దారుణమైన అకృత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, నరాల రాజశేఖర్, యాంసాని శశిధర్, ఓడ్నాల విజయ్, బొరగాల సారయ్య, గంట సంపత్, ఐలయ్య, కొడిమ్యాల పవన్ కుమార్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లాలో విషాదం...

### భార్య మందలించిందని మద్యం మత్తులో భర్త ఆత్మహత్య....

### అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు...

విజయనగరం//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : మద్యం మత్తు మనిషి విచక్షణను ఎలా చెరిపేసి కుటుంబాలను ఎలా నాశనం చేస్తుందో చూపించే దారుణ ఘటన విజయనగరం జిల్లాలో చోటు చేసుకుంది. భార్య మందలింపును, కుటుంబ భవిష్యత్తుపై చేసిన హెచ్చరికను అర్థం చేసుకోలేక ఆవేశంలో తీసుకున్న నిర్ణయం ఒక కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఈ విషాద ఘటనలో ఇద్దరు చిన్నారులు తండ్రి లేని వారిగా మారారు.జిల్లాలోని గాంధీనగర్‌కు చెందిన బెవర శ్రీనివాస్ కూలీ పనులు చేసుకుంటూ భార్య రేవతి, ఇద్దరు చిన్నారులతో జీవనం సాగించేవాడు. రోజూ కష్టపడి సంపాదించే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించేవాడు. అయితే స్నేహితులతో కలిసి సరదాగా తిరుగుతూ మద్యానికి అలవాటు పడ్డాడు. ఆ అలవాటు కొద్ది రోజుల్లోనే వ్యసనంగా మారి అతడిని పూర్తిగా పట్టిపీడించింది.మద్యం వ్యసనం పెరిగేకొద్దీ ఇంటి పరిస్థితి క్రమంగా దెబ్బతింది. సంపాదించే డబ్బు మద్యం కోసం ఖర్చు చేయడం ప్రారంభించడంతో కుటుంబానికి సరిపడా ఖర్చులు చేయలేకపోయాడు. దీంతో ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు రోజురోజుకు పెరిగాయి. అనారోగ్య సమస్యలు, అప్పులు, కుటుంబ పోషణలో ఏర్పడిన లోటు కారణంగా ఇంట్లో ఉద్రిక్తతలు పెరిగాయి. భర్త పరిస్థితి దిగజారిపోతుండటాన్ని గమనించిన భార్య రేవతి పలుమార్లు మందలించింది. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించమని, మద్యపానం మానేయాలని వేడుకుంది. రోజూ తగాదాలు జరుగుతూనే ఉండేవి. అయినప్పటికీ శ్రీనివాస్ మాత్రం



భార్య మాటలను పట్టించుకోకుండా మద్యం మత్తులోనే కాలం గడిపేవాడు.ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌తో భార్య రేవతి మరోసారి వాగ్వాదానికి దిగింది. కుటుంబ పరిస్థితిని వివరించి మద్యాన్ని మానేయాలని కఠినంగా చెప్పింది. భార్య మాటలు అతడిని మరింత బాధపెట్టాయి. కొంతసేపు మౌనంగా ఆలోచనల్లో మునిగిపోయిన శ్రీనివాస్ తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆవేశానికి లోనై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు చిన్నారులు తండ్రిని కోల్పోవడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక కుటుంబాన్ని నిలబెట్టాల్సిన వ్యక్తి మద్యం వ్యసనానికి బలి కావడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మద్యం అలవాటు కుటుంబాలను ఎలా చీల్చి వేస్తుందో, చిన్నపిల్లల భవిష్యత్తును ఎలా నాశనం చేస్తుందో ఈ ఘటన స్పష్టంగా చూపించింది. సమాజంలో మద్యపాన వ్యసనంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. కుటుంబ బాధ్యతలు, పిల్లల భవిష్యత్తు గుర్తు పెట్టుకుని మద్యాన్ని దూరం పెట్టాలని పెద్దలు సూచిస్తున్నారు.ఈ విషాదం ప్రతి ఒక్కరికీ హెచ్చరికగా నిలుస్తోంది. కుటుంబం కోసం బ్రతకాల్సిన వ్యక్తి, మద్యం మత్తులో తీసుకున్న ఒక్క తప్పు నిర్ణయం వల్ల రెండు చిన్నారుల జీవితాల్లో శాశ్వత ఖాళీ మిగిలింది.

## డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మళ్లిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

### విహారయాత్రగా మారిన ముఖ్యమంత్రి దావోస్ పర్యటన...

### బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్...

### బీఆర్ఎస్ పార్టీ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్...

హైదరాబాద్/ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా డ్రామాగా మార్చి, ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మెతుకు ఆనంద్‌తో కలిసి మాట్లాడిన సంజయ్, సీఎం ఒక రోజు కూడా మున్సిపాలిటీల అభివృద్ధిపై మాట్లాడలేదని విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా నిజాలను ప్రజల ముందుంచుతున్నానని సంజయ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్‌రావు పేరుతో సిట్ నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ ఆధారాలు లేవని పేర్కొన్నారు. దావోస్ పేరుతో సీఎం విదేశీ పర్యటనను విహార యాత్రగా మలిచారని విమర్శించారు. 12 రోజుల పర్యటన అనంతరం రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై ప్రభుత్వం ఒక్క మాట కూడా చెప్పలేదని సంజయ్ మండిపడ్డారు.డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తెలంగాణ జాతిపితగా భావించే కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడం



రెండో డ్రామా అని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడంలో సీఎం తనకు తానే సాటి అని విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో మున్సిపాలిటీల్లో సభలు, మున్సిపల్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు.ఇతర పార్టీలతో సంబంధాలు పెట్టుకునేది రేవంత్ రెడ్డి అని, కానీ బీఆర్ఎస్ పార్టీకి బీజేపీకి లింక్ పెడుతున్నారని సంజయ్ అన్నారు. వీణావాణిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ రాష్ట్రానికి జాతిపితగా కేసీఆరే ఉన్నారని స్పష్టం చేశారు.ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు అభివృద్ధిపై ఒక్క మాట మాట్లాడకుండా కేసీఆర్‌ను విమర్శించడం తప్ప ఏమీ చేయలేదని అన్నారు. ప్రతిరోజూ తప్పులు చేస్తూనే ఉన్నారని విమర్శించారు.రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సంజయ్ డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించకపోతే కాంగ్రెస్‌కు గట్టి పాఠం చెబుతామని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్‌పై సీఎం ఆసక్తి ఉన్నందున బడ్జెట్‌లో ఆ అంశంపై కూడా చర్చిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు వద్దకు వెళ్లినందుకు సీఎం కు ధన్యవాదాలు తెలుపుతూ, ముందుగా ఆ ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో తెలుసుకోవాలని సెటైర్లు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని, దానిని రిపేర్ చేయాల్సిందేనని పేర్కొన్నారు. జలాలపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.అసెంబ్లీలో ప్రతిపక్షానికి మైక్ ఇవ్వాలని కోరుతూ, సీఎం రేవంత్ రెడ్డి చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అని విమర్శించారు. అసెంబ్లీని గౌరవించి ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు.పార్టీ మారిన ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్‌పై అనర్హత వేటు వేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తరపున ప్రచారం చేసినా చర్యలు తీసుకోలేదని సంజయ్ ఆరోపించారు.

## యూరియా సరఫరాపై రైతుల ఆందోళన...



యద్రాద్రి//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : రైతులకు యూరియాను నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన రాస్తారోకోలో రైతులు, పార్టీ నాయకులు భారీగా పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూడ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలనుకునే సమయంలో సెకండ్ల వ్యవధిలోనే స్టాక్ ఖాళీ అయిపోతుందని, దీంతో రైతులకు ఎరువులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు రాకపోవడం, స్మార్ట్‌ఫోన్ లేని పరిస్థితుల్లో చాలా మంది రైతులు యాప్ విధానం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి యూరియాను పాత పద్ధతిలోనే సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు మరింత తీవ్రంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గుంటి మధుసూదన్ రెడ్డి, చింతలపూరి వెంకటరామిరెడ్డి, బెడిదే వీరేశం, పల్లె సంతోష్ గౌడ్, అంకతి సుదర్శన్, బోగా హరినాథ్, మరల నాగరాజు, లక్ష్మణ్ నాయక్, కనకయ్య, కర్ల భాను రెడ్డి, కరుణాకర్, కటకం వెంకటేశం, వరిమడ్ల బాలకృష్ణ, తుంగ అక్షయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 'చలో సెక్రటేరియట్'కు ఆర్టీసీ సన్నద్ధం...

### హక్కుల సాధన కోసం శాంతియుత పోరాటం...

### ఈదురు వెంకన్న విజ్ఞప్తి...



హైదరాబాద్//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : తమ హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 24న నిర్వహించనున్న "చలో సెక్రటేరియట్" కార్యక్రమానికి ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున సన్నద్ధమవుతున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి, పోలీస్ యంత్రాంగానికి టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరే ఆర్టీసీ ఉద్యోగులను అడ్డుకోవద్దని, వారి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని కోరారు.ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఆర్టీసీ సంస్థ రక్షణ కోసం జరుగుతున్న ఈ ఉద్యమం కార్మికుల ఆత్మగౌరవ పోరాటమని ఆయన పేర్కొన్నారు.ఇది ఆకలి పోరాటం, బతుకు పోరాటం, హక్కుల కోసం పోరాటం మాత్రమే కాకుండా, కార్మికుల శ్రమ దోపిడీపై నడుస్తున్న పోరాటమని వెంకన్న వివరించారు. తమ శ్రమకు తగిన ఫలితం అందుకోవడం కోసం, కార్మిక సంఘాల హక్కులను కాపాడుకోవడం కోసం ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ పోరాటం పూర్తిగా శాంతియుతంగా, గాంధేయ మార్గంలోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు.



ఫిబ్రవరి 24న రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాద్‌కు చేరుకునే ఆర్టీసీ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వం, పోలీస్ శాఖలను కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్దకు రానివ్వకుండా అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్మికుల గోసలు, వారి ఆక్రందనలు చూసి ప్రభుత్వం స్పందించాలనే ఆశతో కార్మికవర్గం భారీగా తరలివస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసే ప్రయత్నాలు చేయవద్దని ప్రభుత్వం, పోలీసులకు హెచ్చరించారు. ఒకవేళ కార్మికులను అడ్డుకునే ప్రయత్నం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి బస్సులు అక్కడే నిలిపివేసి విధుల బహిష్కరణకు దిగాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ పోరాటం చివరి వరకు కొనసాగుతుందని ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రకటించారు.

## రాజమండ్రిలో కల్తీ పాలు కలకలం...

### నలుగురు మృతి 13 మందికి తీవ్ర అనారోగ్యం...



రాజమండ్రి//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో కల్తీ పాలు విషాదాన్ని మిగిల్చాయి. చౌడేశ్వరి నగర్, వెంకటేశ్వర నగర్ కాలనీల్లో కల్తీ పాలు సేవించడంతో నలుగురు మృతి చెందగా, మరో 13 మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఒక్క సారిగా పలువురు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సమాచారం మేరకు, ఒకే ప్రాంతంలో పాలు కొనుగోలు చేసిన కుటుంబాలు ఈ ప్రమాదానికి గురయ్యాయని అధికారులు అనుమానిస్తున్నారు. పాలు సేవించిన కొద్దిసేపటికే బాధితుల్లో అస్వస్థత లక్షణాలు కనిపించాయి. వెంటనే కుటుంబ సభ్యులు వారిని సమీప ఆసుపత్రులకు తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించి నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు ధృవీకరించారు.ఈ ఘటనతో రాజమండ్రి నగరంలో భయాందోళనలు నెలకొన్నాయి. స్థానికులు కల్తీ పాలు ఎలా సరఫరా అయ్యాయన్నదానిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలు ప్రభుత్వాన్ని నిందిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పాలు సరఫరా చేసిన విక్రేతలు, డిస్ట్రిబ్యూటర్లు, సరఫరా శ్రేణిని గుర్తించి విచారణ చేపడుతున్నారు. మృతుల పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత అసలు కారణాలు స్పష్టమవుతాయని పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా, కల్తీ పాల వ్యవహారం తీవ్రంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో హెల్త్ డిపార్ట్‌మెంట్, వైద్యులు, ఆశావర్కర్లు మరియు ఇతర సిబ్బందితో కలిపి 13 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు చౌడేశ్వరి నగర్, వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మరెవరైనా ప్రభావితులై ఉన్నారా అనే దానిపై సమాచారం సేకరిస్తున్నాయి.ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పాలు లేదా ఆహార పదార్థాలు వినియోగించవద్దని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లాలని కోరారు.కల్తీ పాలు ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలు బయటపడుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తిరుమలలో క్యూలైన్‌లో భక్తురాలికి పాము కాటుడ



తిరుమల//ఫిబ్రవరి 23 (ఆకాంక్ష) : శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు చేరుకునే పవిత్ర క్షేత్రం తిరుమలలో ఒక ఘటన భక్తుల్లో కలకలం రేపింది. దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న ఓ మహిళా భక్తురాలిని అకస్మాత్తుగా పాము కాటేయడంతో అక్కడి భక్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే టీటీడీ సిబ్బంది తక్షణ చర్యలతో ప్రమాదాన్ని తప్పించగలిగారు.తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లాకు చెందిన మౌనిక (27) అనే యువతి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల చేరుకుని రూ.300 ప్రత్యేక దర్శనం కోసం క్యూలైన్‌లో నిలిచింది. ఆదివారం రాత్రి సమయంలో క్యూలైన్‌లో ముందుకు కదులుతూ ఉండగా అకస్మాత్తుగా అక్కడికి చేరిన పాము ఆమెను కాటేసింది. ఈ ఘటనతో క్యూలో ఉన్న భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. భక్తురాలిని పాము కాటేసిందన్న సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది, వైద్య సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆలస్యం చేయకుండా ఆమెను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, పరిస్థితిని పర్యవేక్షించారు.భక్తురాలి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్యులు ఆమెను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెను ఐసీయూ విభాగంలో ఉంచి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.ఈ ఘటనతో తిరుమలలో భద్రతా చర్యలపై చర్చ మొదలైంది. పాము ఎలా క్యూలైన్‌లోకి చేరింది అనే అంశంపై టీటీడీ అధికారులు విచారణ చేపట్టారు. భక్తుల భద్రత కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని, క్యూలైన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడమే కాకుండా, పాములు వంటి జంతువులు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.తిరుమల వంటి అత్యంత భక్తులు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఈ తరహా ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అవసరమని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఘటనతో భక్తుల్లో కొంత భయాందోళన నెలకొన్నప్పటికీ, టీటీడీ సిబ్బంది అప్రమత్తతతో ఒక ప్రాణాపాయం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లా శ్యామ్‌పూర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదం...

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం..



ఆదిలాబాద్//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం శ్యామ్‌పూర్ గ్రామ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదం తీవ్ర ఆందోళన కలిగించింది. ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇరుకైన బ్రిడ్జిపై నుంచి అదుపు తప్పి కిందపడటంతో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు మంత్రి వెంటనే ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రాథమిక సమాచారాన్ని మంత్రికి అందించిన ఎండీ, ప్రమాదం జరిగిన బ్రిడ్జిపై ప్రొటెక్షన్ వాల్ లేకపోవడం, బ్రిడ్జి ఇరుకుగా ఉండటం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు వివరించారు.ఈ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీతోనూ ఫోన్ ద్వారా మాట్లాడి ప్రమాద స్థితిగతులను తెలుసుకున్నారు. గాయపడిన ప్రయాణికులకు తక్షణం నాణ్యమైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఘటనాస్థలానికి చేరుకున్న ఆదిలాబాద్ మరియు ఆసిఫాబాద్ ఆర్టీసీ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ రక్షణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ప్రమాదంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన బ్రిడ్జి వద్ద భద్రతా చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన పోలీస్ క్రీడాకారులు...

### కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు....



గోదావరిఖని//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగుండంలో రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన పోలీస్ క్రీడా కారులను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని, విజేతలను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్2026 పోటీల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. కాళేశ్వరం జోన్ నుంచి మొత్తం 150 మంది పాల్గొనగా, అందులో 30 మంది క్రీడాకారులు 23 పతకాలు సాధించారు. అందులో 7 బంగారు, 8 వెండి, 8 కాంస్య పతకాలు ఉన్నాయి.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రాణించడం పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీస్ సిబ్బందికి పూర్తి స్థాయి సహకారం అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత కృషి చేసి శాఖకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ సమన్వయం, నిరంతర సాధన ద్వారానే క్రీడల్లో విజయాలు సాధ్యమవుతాయని ఆయన అన్నారు.క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక స్థైర్యాన్ని పెంచుతాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. క్రీడాకారులకు శాఖ తరపున అన్ని విధాల మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ క్రీడల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 15 మంది క్రీడాకారులు, ములుగు జిల్లా నుండి 5 మంది, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 6 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి 4 మంది పతకాలు సాధించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు శేఖర్, పెద్దన్న, సీసీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మంథని మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గానికి ఘన సన్మానం..



మంథని//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గానికి ఘన సన్మానం నిర్వహించారు. మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సహేంధర్ రెడ్డిని యూనియన్ నాయకులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు, కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నూతన పాలకవర్గాన్ని కోరారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సబ్బులు, నూనెలు, దుస్తులు, కూలీ డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తూ నష్టపోతున్న ఎన్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్ట్ లిస్టులో విలీనం చేయాలని, ఇటీవల నియమించిన ఆరుగురు కార్మికులను కూడా కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారుడు చింతల గోవింద్, గౌరవాధ్యక్షుడు బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, యూనియన్ నాయకులు మల్లేష్, చందు, గట్టయ్య, జంపయ్య, అనిల్, రాజయ్య, భాగ్య, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాగ్సన్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం....

### సర్పంచ్ దండం సుశీల దుర్గయ్య హామీల అమలు దిశగా వేగవంతమైన చర్యలు....



మెదక్//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** నాగ్సన్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు నూతన సర్పంచ్ దండం సుశీల దుర్గయ్య శ్రీకారం చుట్టారు. పాపన్నపేట మండలం పరిధిలోని ఈ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తూ గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నారు.సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన పది రోజుల్లోనే వడ్డెర కాలనీలో నూతన బోరు వేయించి కాలనీవాసుల నీటి సమస్యను తీర్చారు. గత రెండు సంవత్సరాలుగా మురుగు కాలువలు నిండిపోయి రోడ్లపై మురుగు నీరు పారుతున్న సమస్యను గుర్తించి వెంటనే కూలీలతో శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. దీంతో గల్లీల్లోని అస్వచ్ఛత తొలగి గ్రామంలో శుభ్రత నెలకొంటోంది.గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రసిద్ధ ఏడుపాయల దేవస్థానం జాతర నిర్వహణలో కూడా సర్పంచ్ ముందుండి వ్యవహరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతరను సక్రమంగా నిర్వహించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ దండం సుశీల దుర్గయ్య మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. పున్నమి ఓట్లతో గెలిపించిన గ్రామస్తుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత అభివృద్ధి పనులు చేపడతానని, గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు కూడా సర్పంచ్ తీసుకుంటున్న అభివృద్ధి చర్యలను అభినందిస్తూ భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కార్మిక సంక్షేమం విస్మరించిన యాజమాన్యం...

### SCEU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి....



గోదావరిఖని//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలోని సింగరేణి సంస్థలో కార్మిక సంక్షేమం నిర్లక్ష్యానికి గురవుతోందని ఎస్ సీ ఈ యూ (రాజుజుఖ) నాయకులు తీవ్రంగా ఆరోపించారు. తాగునీటి సరఫరా, కాలుష్య నియంత్రణ, మురుగు నీటి శుద్ధి వంటి కీలక ప్రాజెక్టులు పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడం కార్మిక కుటుంబాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.సోమవారం గ్రావిటీ ఫిల్టర్ బెడ్, జూరా-1, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా రాజుజుఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ పలు అంశాలను వెలుగులోకి తెచ్చారు. 18 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన గ్రావిటీ ఫిల్టర్ బెడ్ పనులు దాదాపు పూర్తయినా, నిల్వ ట్యాంక్‌కు టెండర్ ఇవ్వకపోవడంతో ప్రారంభం ఆలస్యం అవుతోందన్నారు. వేసవి కాలం దృష్ట్యా వెంటనే టెండర్ విడుదల చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.జూరా-1 నుంచి వెలువడుతున్న బొగ్గు దుమ్ము కార్మికుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని, +ఐఖ-1&3, 2, 2ఖా ప్రాంతాల్లో పనిచేసే కార్మికులతో పాటు పరిసర కాలనీల ప్రజలు కూడా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. జీఎం కాలనీ, సీయస్పీ కాలనీ, గాంధీ నగర్, మిలీనియం క్వార్టర్స్, గంగానగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టి కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని రక్షించాలని కోరారు.17 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన కొత్త సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు పూర్తికి దగ్గరగా ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. సంస్థలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉన్నతాధికారులు వెంటనే నిధులు విడుదల చేసి ప్లాంట్‌ను ప్రారంభించాలన్నారు. గోదావరిఖని ప్రాంతంలో ప్రవహిస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసి గోదావరిలో కలపడం ద్వారా కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు.పాత జూరా ప్లాంట్ కేవలం అలంకారప్రాయంగా మారిందని, ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ మురుగు నీటి శుద్ధి సరిగా జరగడం లేదని విమర్శించారు. కేవలం ఓసీ-5 ప్రాజెక్ట్‌కు అనుమతుల కోసం నిర్మించిన ప్లాంట్‌ను నిరుపయోగంగా మార్చారని ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ సంస్థలు దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో =+1 గౌరవ అధ్యక్షులు, అధ్యక్షుడు, కార్యదర్శులు అరెపల్లి రాజమౌళి, వంగల శివరాంరెడ్డి, మెండే శ్రీనివాస్, సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, అనబోయిన శంకర్, ఆసారి మహేష్, ఎస్‌కే గౌస్, కొమ్ము రమేష్, సానబోయిన సాయి ప్రకాష్, తాళ్ల శ్రీనివాస్, కట్కం రాకేష్, తుమ్మల కృష్ణారెడ్డి, గద్దె జనార్ధన్, గట్టేపల్లి కృష్ణారెడ్డి, చిట్టబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు యువకులు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు..





రంగారెడ్డి//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.హైతాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నాగర్‌గూడ చౌరస్తా వద్ద ప్రయాణిస్తున్న సమయంలో కంటైనర్ లారీ ఢీ కొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతులు దాసరి అజయ్ (19), ఉదయ్ కిరణ్ (20)గా గుర్తించారు. వీరిద్దరూ గ్రామానికి చెందిన స్నేహితులు కాగా, పనిమీద బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా నాగర్‌గూడ చౌరస్తా వద్ద ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ వేగంగా ఢీకొట్టింది. ఢీకొన్న దెబ్బకు ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ ప్రమాదంలో గాయపడిన అజమ్ (19)కు కాలు విరిగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు గాయపడిన అజమ్‌ను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనతో హైతాబాద్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాసరి అజయ్ కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉంది. అతనికి తల్లి లేకపోవడంతో తండ్రే ఆధారం.రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అజయ్ మృతితో కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది. ఉదయ్ కిరణ్ కూడా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.అజమ్ చికెన్ షాపులో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని, అతనికి కూడా తల్లి దండ్రులు లేరని గ్రామస్థులు తెలిపారు.ఈ ప్రమాదం నేపథ్యంలో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుల మృతితో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలను విచారిస్తూ తదుపరి చర్యలు చేపడుతున్నారు.

## సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నకిలీ బంగారం బిస్కెట్ల కలకలం....

### నమ్మించి ముంచిన బ్యాంక్ ఉద్యోగి, షాపు యజమాని...!




సూర్యాపేట//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో నకిలీ బంగారం బిస్కెట్ల వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పు తీర్చమని అడిగిన వ్యక్తిని నమ్మబలికి నకిలీ బంగారు బిస్కెట్లు ఇచ్చి మోసం చేసిన ఘటనలో ఒక ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి, స్థానిక జ్యువెలరీ షాపు యజమాని పాత్రపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సమాచారం మేరకు, హుజూర్‌నగర్‌కు చెందిన బాధితుడికి ఒక ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న శివ అనే వ్యక్తి కొంతకాలంగా డబ్బులు బాకీగా ఉన్నాడు. పలుమార్లు డబ్బులు అడిగినా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు గట్టిగా నిలదీయగా, తన దగ్గర నగదు లేదని, బదులుగా బంగారు బిస్కెట్లు ఉన్నాయని శివ చెప్పి నమ్మబలికాడు. నమ్మకం కలిగించేలా బాధితుడిని పట్టణంలోని ఒక ప్రముఖ జ్యువెలరీ షాపుకు తీసుకెళ్లి, తన వద్ద ఉన్న రెండు బిస్కెట్లను (సుమారు 100 (గ్రాములు) అప్పగించాడు.ఈ వ్యవహారంలో జ్యువెలరీ షాపు యజమాని కూడా మధ్యవర్తిగా వ్యవహరించినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు. శివ తనకు కూడా డబ్బులు ఇవ్వాల్సి ఉందని చెప్పి, బిస్కెట్లను అప్పుగా ఇచ్చినట్లు చెప్పడం ద్వారా బాధితుడిని నమ్మించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. బిస్కెట్లు తీసుకుని ఇంటికి వెళ్లిన బాధితుడు అనుమానం వచ్చి వాటిని పరీక్షించగా, అవి అసలు బంగారం కాదని, నకిలీగా తయారు చేసిన దొంగ బిస్కెట్లు అని తేలింది. దీంతో షాక్‌కు గురైన బాధితుడు, వెంటనే తన అనుచరులతో కలిసి సంబంధిత జ్యువెలరీ షాపు ముందు బైఠాయించి నిరసన చేపట్టాడు. షాపు యజమాని, శివ ఇద్దరూ కుమ్మక్కై తనను పథకం ప్రకారం మోసం చేశారని ఆరోపిస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో షాపు వద్ద ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నమ్మించి నకిలీ బంగారం అంటగడతారా? సామాన్యులను మోసం చేసే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అంటూ బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్ పట్టణంలో జరిగిన ఈ నకిలీ బంగారం బిస్కెట్ల ఘటన స్థానికంగా చర్చనీయాంశమవడంతో పాటు, ఇటువంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే అవగాహన అవసరమని అధికారులు సూచిస్తున్నారు.

## ఇంటర్ పరీక్ష రోజున తండ్రి గుండె పోటుతో మృతి...

### కుమారుడి అగ్ని పరీక్షగా మారిన తండ్రి మరణం...

### తండ్రి అంత్యక్రియలేనా పరీక్షలేనా

### విద్యార్థి ఎదుట కఠిన పరిస్థితి...

### నెల్లూరు జిల్లా సంగం మండలంలో

### హృదయాన్ని కదిలించిన ఘటన...






నెల్లూరు//**ఫిబ్రవరి 23 ఆకాంక్ష :** నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. ఒక వైపు ఇంట్లో తండ్రి మృతదేహం, మరో వైపు జీవితానికి మలుపు తిప్పే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలుడ ఇలాంటి విరుద్ధ పరిస్థితుల్లో ఓ విద్యార్థి పడిన మానసిక వేదన అక్కడి ప్రజలను కదిలించింది. కుటుంబ బాధ్యతలతో పాటు చదువు మధ్య ఇరుక్కుపోయిన ఆ బాలుడి పరిస్థితి అందరినీ కంటతడి పెట్టించింది. సంగం మండల కేంద్రానికి చెందిన కందల శివకుమార్ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబానికి ఏకైక ఆధారమైన ఆయన మరణంతో ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శివకుమార్ తన కుటుంబాన్ని ఎంతో ప్రేమతో పోషిస్తూ, తన కుమారుడు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కలలు కనేవాడు. ఆ ఆశలన్నీ ఒక్కసారిగా ఛిద్రమయ్యాయి. శివకుమార్ కుమారుడు రామసాయి ప్రస్తుతం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో ఇంట్లో తండ్రి మృతదేహం ఉండటం, మరోవైపు పరీక్షలకు హాజరు కావాల్సిన బాధ్యత రావడం రామసాయిని తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసింది.పరీక్షలకు వెళ్లాలా? లేక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనాలా? అనే సందిగ్ధ పరిస్థితిలో విద్యార్థి కన్నీరుమున్నీరయ్యాడు. తన భవిష్యత్తు కోసం చదువుకోవాలని తండ్రి ఎప్పుడూ చెప్పిన మాటలు గుర్తొచ్చినా, ఆ దుఃఖంలో పరీక్షకు వెళ్లడం అతనికి చాలా కష్టంగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కూడా ఈ పరిస్థితిని చూసి చలించిపోయారు.పేద కుటుంబానికి చెందిన శివకుమార్ కష్టపడి తన కుమారుడిని చదివించేవాడు. తనకు ఎదురైన కష్టాలు తన బిడ్డకు రాకూడదని, మంచి చదువుతో మంచి జీవితం సాధించాలని ఎప్పుడూ ప్రోత్సహించేవాడు. కానీ పరీక్షల మొదటి రోజే ఆయన మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది.ఈ ఘటన గురించి తెలిసిన స్థానికులు విద్యార్థికి ధైర్యం చెప్పేందుకు ముందుకు వచ్చారు. కొందరు పరీక్షకు హాజరయ్యేలా ప్రోత్సహిస్తే, మరికొందరు కుటుంబ బాధ్యతలు ముందుగా చూడాలని సూచించారు. ఈ పరిణామం గ్రామంలో చర్చనీయాంశమైంది.తండ్రి కలలను నెరవేర్చాలనే బాధ్యత ఒకవైపు, కన్నతండ్రి మృతదేహాన్ని వదిలి పరీక్షకు వెళ్లాలనే బాధ మరోవైపుడ ఈ రెండు మధ్య చిక్కుకున్న రామసాయి పరిస్థితి హృదయ విదారకంగా మారింది. ఇలాంటి అగ్ని పరీక్ష మరెవరికీ రాకూడదని గ్రామస్తులు భావోద్వేగంతో అంటున్నారు.ఈ ఘటన విద్యార్థుల జీవితాల్లో ఎదురయ్యే అనుకోని కష్టాలను గుర్తు చేస్తూ, సమాజం వారి పట్ల మరింత సహానుభూతితో ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. కుటుంబ పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా విద్యాభ్యాసం కొనసాగించేందుకు సహకరించాల్సిన బాధ్యత అందరిదని స్థానికులు అభిప్రాయపడ్డారు.మొత్తానికి సంగం మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసింది. తండ్రి మరణం దెబ్బతో విషాదంలో మునిగిపోయిన రామసాయి భవిష్యత్తు పట్ల అందరూ ఆందోళన వ్యక్తం చేస్తూ, అతను తండ్రి ఆశయాలను నెరవేర్చాలని కోరుకుంటున్నారు.